గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కాలంలో
రాష్ట్రంలో కల్తీ మద్యం
విస్తరించిపోయింది. ఎంతో మంది
ప్రజలు అనారోగ్యంతో మరణించారు. ఈ
రోజు కల్తీ మద్యం గురించి వైసీపీ
వ్యాఖ్యలు దెయ్యాలు వేదాల్లా ఉన్నాయి.
కూటమి ప్రభుత్వం అవినీతి,
అఘాయిత్యాలకు వీలు ఇవ్వదు.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



బుధవారం 08.10.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 172 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# మంత్రి సత్యకుమార్ సంచలనం.. వైద్యారోగ్యశాఖలో విప్లవాత్మక పాలనా వికేంద్రీకరణ

ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనకనుగుణంగా మంత్రి కీలక నిర్ణయం

వివిధ స్థాయి అధికారులకు స్వతంత్ర నిర్ణయాధికారం

మొత్తం 45 విషయాల్లో 17 అంశాల్లోనే మంత్రి స్థాయిలో నిర్ణయం

28 అంశాలను అధికారులకు బదలాయించిన మంత్రి సత్యకుమార్ యాదవ్

పాలనలో భాగస్వామ్యంతో సత్వర నిర్ణయాలకు చొరవ తీసుకున్న మంత్రి

మంత్రి సత్యకుమార్ యాదవ్ నిర్ణయానికి ప్రశంసలు

ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్య శాఖలో మంత్రి సత్యకుమార్ హయంలో నూతన పాలనాయుగం మొదలైంది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనతో మంత్రి సత్యకుమార్ యాదవ్ నేతృత్వంలో చేపట్టిన అధికార వికేంద్రీకరణ నిర్ణయాలు, వేగవంతమైన, సమర్థవంతమైన, పారదర్శక పాలనకు దోహదపడుతూ, ప్రతి సిబ్బందికి స్వతంత్ర నిర్ణయాధికారం, బాధ్యతలలో భాగస్వామ్యం కల్పించాయి. ఈ విప్లవాత్మక మార్పులు సిబ్బంది ఉత్సాహాన్ని పెంచుతూ, ప్రజలకు నేరుగా ఉపయోగపడే ఫలితాలను ఇవ్వడంలో కీలకంగా మారుతున్నాయి. ఈ చర్యలు వైద్యరంగంలో స్ఫూర్తిదాయక మార్పులు సృష్టించాయి వైద్య రంగంలో నూతన దిశ, స్ఫూర్తి, మార్పుల ప్రతీకగా ఈ ప్రయత్నం నిలుస్తుంది. ఈ కొత్త విధానం రాష్ట్రంలోని వైద్య పరిపాలనలో ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిందని విశ్లేషకులు గుర్తిస్తున్నారు.

మిగతా 8లో...



## మున్సిపాలిటీల్లో శరవేగంగా అభివృద్ధి పనులు




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** పట్టణాల్లో మౌళిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి నారాయణ అన్నారు...ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా మున్సిపల్ కమిషనర్లు చొరవ తీసుకోవాలని సూచించారు..మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీర్లతో ఆ శాఖ డైరెక్టర్ కార్యాలయంలో మూడు రోజుల పాటు వర్క్ షాప్ జరుగుతుంది... ఈ వర్క్ షాప్ నకు మంత్రి నారాయణ హాజరయ్యారు... రాష్ట్రంలోని 77 మున్సిపాలిటీల కమిషనర్లు,ఇంజినీర్లతో మూడు రోజుల పాటు వేర్వేరుగా వర్క్ షాప్ జరగనుంది..మొదటి రోజు వర్క్ షాప్ నకు 29 మున్సిపాలిటీల నుంచి అధికారులు హాజరయ్యారు.. పట్టణాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఈ వర్క్ షాప్ లో ప్రధానంగా చర్చించారు. 2029 లోగా పూర్తి చేయాల్సిన అభివృద్ధి ప్రాజెక్ట్ లపై అధికారులకు పలు సూచనలు చేసారు..ఆ తర్వాత పట్టణాభివృద్ధిపై అధికారులకు మంత్రి నారాయణ దిశానిర్దేశం చేసారు.

మున్సిపాలిటీల్లో ఘన,ద్రవ వ్యర్థాల నిర్వహణ, డ్రైనేజి, రోడ్లు,వీధి దీపాల నిర్వహణ పక్కాగా చేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. రాష్ట్రంలో పేరుకుపోయిన లెగసీ వేస్ట్ 85 లక్షల మెట్రిక్ టన్నులు ఇప్పటికే తొలగించగా....మరో 20 లక్షల టన్నుల లెగసీ వేస్ట్ ను డిసెంబర్ నెలాఖరుకు తొలగిస్తామన్నారు...జనవరి నుంచి ఘన వ్యర్థాలు పూర్తిగా ప్రాసెస్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు...అలాగే ప్రస్తుతం ఉన్న రెండు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల లకు అదనంగా కొత్తగా మరో 6 ప్లాంట్లను ఏర్పాటుచేస్తున్నామని...ఇవన్నీ పూర్తయితే రాష్ట్రంలోని మున్సిపాలిటీలు డంపింగ్ యార్డ్ రహితంగా మారతాయన్నారు.

మరోవైపు ద్రవ వ్యర్థాల నిర్వహణ అత్యంత కీలకం అన్న మంత్రి నారాయణ....ప్రతిరోజూ ఇళ్లలో ఉపయోగించిన నీటితో పాటు వర్షపు నీరు కోసం కాలువల నిర్మాణం చేపడుతున్నామన్నారు...అమృత్ పథకం 2 ద్వారా మున్సిపాలిటీల్లో రాబోయే రెండేళ్లలో 90 శాతం ఇళ్లకు తాగునీరు అందించేలా ముందుకెళ్తున్నామన్నారు..ఇక డ్రైనేజిలు,రోడ్లు,వీధి దీపాల కోసం వివిధ పథకాల నిధులతో పాటు మున్సిపాలిటీల నిధులు వినియోగించాల్సి ఉందన్నారు. ప్రాధాన్యతా క్రమంలో ఈ అభివృద్ధి పనులను పూర్తి చేయాలి..అమృత్,ఆసియన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్ మెంట్ బ్యాంక్,అర్బన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ నిధుల ద్వారా డ్రింకింగ్ వాటర్,డ్రైనేజి నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు..

మరోవైపు మున్సిపాలిటీల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణం,ప్రస్తుత పరిస్థితిపైనా అధికారులకు పలు సూచనలు చేసారు...నిర్మాణాలు పూర్తవుతున్న ఇళ్లను ప్రతి శనివారం లబ్దిదారులకు కేటాయించాలని ఆదేశించారు...వచ్చే జూన్ నాటికి టిడ్కో ఇళ్ల నిర్మాణం వంద శాతం పూర్తి చేయాలని సూచించారు..బుధవారం,గురువారం మరికొన్ని మున్సిపాలిటీల అధికారులతో జరిగే వర్క్ షాప్ లోనూ మంత్రి నారాయణ పాల్గొనున్నారు. ఈ వర్క్ షాప్ లో మున్సిపల్ శాఖ డైరెక్టర్ సంపత్ కుమార్,టిడ్కో ఎండీ సునీల్ కుమార్ రెడ్డి,ప్రజారోగ్య విభాగం ఇంజినీర్ ఇన్ చీఫ్ ప్రభాకర రావు పాల్గొన్నారు.

## హైస్పీడ్ కారిడార్‌కు గ్రీన్ సిగ్నల్..?



రాజధాని అమరావతికి మహర్దశ

జాతీయ నేషనల్ హైవే లకు సమాంతరంగా నిర్మాణం

ఆధునిక టెక్నాలజీతో భారీ కసరత్తు

ఇక రాజధానికి మంచి రోజులే

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మరో భారీ రవాణా ప్రాజెక్ట్ రాబోతోంది. ఇప్పటికే కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారి-16 (ఎన్ హెచ్.16) రాష్ట్రం మీదుగా నడుస్తుండగా, దీనికి సమాంతరంగా ఒక కొత్త హైస్పీడ్ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. సరకు రవాణా, వేగవంతమైన ప్రయాణానికి ప్రత్యేకంగా అనువైన ఈ ప్రాజెక్ట్ దేశంలో ఉత్తర, దక్షిణ ప్రాంతాల అనుసంధానానికి కీలకంగా మారనుంది.

రాష్ట్రానికి మరో హైస్పీడ్ కారిడార్ - అమరావతితో అనుసంధానం చేయనున్నారు. ప్రస్తుతం ఎన్ హెచ్-16లో వాహన రద్దీ పెరగడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొన్నిచోట్ల ఇది నాలుగు వరుసలుగా,

మిగతా 2లో...


## రాష్ట్రంలో నూతన బీసీ గురుకులాల ఏర్పాటు



**కర్నూలు, (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో మరిన్ని నూతన బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల ఏర్పాటు చేయబోతున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. వెనుకబడిన తరగతుల విద్యకు కూటమి అధిక ప్రాధాన్యమిస్తోంది, దీనిలో భాగంగా బీసీ విద్యార్థులకు ఉన్నత విద్య కోసం పావలా వడ్డీకే విద్యా రుణాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. వాల్మీకులకు ఎస్టీలో చేర్చేలా కృషి చేస్తామని మంత్రి సవిత ప్రకటించారు. మంగళవారం మహర్షి వాల్మీకి జయంత్యోత్సవాన్ని స్థానిక కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీలతో కలిసి వాల్మీకి చిత్రపటానికి పూల మాల వేసి, జ్యోతి ప్రజల్వన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, వాల్మీకి రామాయణం రచించి సమాజానికి సన్మార్గాన్ని చూపుతోందన్నారు. వాల్మీకి మహర్షి వాల్మీకులకు మాత్రమే సొంతం కాదని ప్రపంచానికే సొంతమన్నారు. వాల్మీకి రామాయణం ప్రపంచ ప్రఖ్యాతగాంచిందన్నారు. రామాయణం కేవలం మత గ్రంథం మాత్రమే కాదని కుటుంబ విలువలు, నైతిక విలువలు బోధిస్తూ, సమాజ నిర్మాణానికి దిక్సూచిగా పనిచేస్తోందని అన్నారు. భార్యాభర్తలు, అన్న దమ్ముల మధ్య సఖ్యత గురించి,

మిగతా 2లో...

## హైవే ప్రయాణం ఇక సులభం




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** జాతీయ రహదారులపై ప్రయాణం మరింత సులభంగా, సురక్షితంగా, స్మార్ట్‌గా మారుతోంది. మనం రహదారులపై వేగంగా ప్రయాణిస్తూ ఎన్నో సౌకర్యాలను చూడకుండానే వెళ్లిపోతుంటాం. రహదారుల్లో ఉన్న సేవలు, సదుపాయాలను ఎలా ఉపయోగించుకోవాలో తెలియక చాలామంది ఇబ్బంది పడుతుంటారు. ఈ సమస్యకు పరిష్కారంగా ఎన్‌హెచ్‌ఏఐ రూపొందించిన "రాజ్‌మార్గ్ యాత్ర" యాప్ ప్రయాణికులకు నిజమైన తోడ్పాటుగా మారింది.

**రాజ్‌మార్గ్ యాత్ర యాప్ - ప్రయాణికుల డిజిటల్ గైడ్:** ఈ యాప్ మీ ఫోన్‌లో ఉంటే జాతీయ రహదారులపై ప్రతి సమాచారం మీ చేతిలోనే ఉంటుంది. మీరు ప్రయాణిస్తున్న మార్గంలో ఉన్న రెస్టారెంట్లు, పెట్రోల్ బంకులు, ఛార్జింగ్ స్టేషన్లు, ఆసుపత్రులు, ఏటీఎంలు, పోలీస్‌స్టేషన్లు, పర్యాటక ప్రాంతాలు వంటి వివరాలు యాప్‌లో వెంటనే కనిపిస్తాయి. రోడ్ల పరిస్థితి, వాతావరణ మార్పులు, ప్రమాదకర ప్రాంతాల గురించి కూడా ముందుగానే హెచ్చరికలు ఇస్తుంది.

రహదారులు దెబ్బతిన్న చోట ఫోటో తీసి ఫిర్యాదు చేయడం, ఫాస్టాగ్ రీచార్జ్ చేయడం, టోల్‌ప్లాజా వివరాలు తెలుసుకోవడం అన్నీ ఒక్క యాప్ ద్వారానే సాధ్యమవుతుంది. మీరు గమ్యస్థానం నమోదు చేస్తే, ఆ మార్గంలో ఎన్ని టోల్‌ప్లాజాలు ఉన్నాయో, ఎంత చెల్లించాలో యాప్ చూపిస్తుంది. మీరు అధిక వేగంతో ప్రయాణిస్తే వెంటనే నోటిఫికేషన్ ద్వారా హెచ్చరికలు వస్తాయి. ఈ యాప్ తెలుగు, ఇంగ్లీష్‌తో పాటు మరో 11 భాషల్లో అందుబాటులో ఉంది.

**టోల్ ఫీజుల్లో ఉపశమనం - వార్షిక పాస్ సదుపాయం:** జాతీయ రహదారులపై తరచూ ప్రయాణించే వారికి

మిగతా 2లో...

## ఉప్పాడ మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కమిటీ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచన మేరకు కాకినాడ జిల్లా ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారుల సమస్యల పరిష్కారం కోసం ఓ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీలో పరిశ్రమలు, మత్స్య శాఖ కమిషనర్లు, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ సెక్రటరీ, కాకినాడ జిల్లా కలెక్టర్ ఉంటారు. వీరితోపాటు కాకినాడ జిల్లా కలెక్టర్ ద్వారా నామినేట్ అయ్యే మత్స్యకార వర్గానికి చెందిన సభ్యులు ఈ కమిటీలో ఉండనున్నారు. ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారుల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపేందుకు ఈ కమిటీ కృషి చేయనుంది. మత్స్యకారుల సమస్యలపై తక్షణం స్పందించి కమిటీ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకి పవన్ కల్యాణ్ ధన్యవాదాలు తెలిపారు.

## కల్తీ మద్యం నిందితులను వదలం




**మచిలీపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** కల్తీ మద్యం నిందితుల్లో ఎంతటివారున్నా వదిలిపెట్టబోమని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మచిలీపట్నంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. " రాష్ట్రంలో మద్యం మాఫియా తయారు చేసింది జగన్ కాదా? దక్షిణాఫ్రికాలో వైకాపా పెద్దలకు మద్యం వ్యాపారాలు లేవా? జగన్ సోదరుడు అవినాష్‌కు, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి లేవా? రాష్ట్రంలో కల్తీ మద్యం వెనుక ఉన్న మూలాలు అన్నింటినీ బయటకు తీస్తున్నాం.

మిగతా 2లో...

## వైసీపీని రాష్ట్రం నుంచి బహిష్కరించాలి

- ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** భారత రాజ్యాంగ నిర్మాత డా. బీ. ఆర్. అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వైసీపీని రాష్ట్రం నుంచి బహిష్కరించాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు డిమాండ్ చేశారు.

మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... "అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం చేసి రాష్ట్రంలో శాంతి భద్రతలను భంగపరిచేలా కుట్ర చేసిన వైసీపీ నేతలు తాడేపల్లి ప్యాలెస్ నుంచి వచ్చిన డైరెక్షన్ మేరకే పనిచేస్తున్నారు" అని తీవ్రస్థాయిలో విమర్శించారు.

ఆనంద్ బాబు మాట్లాడుతూ, "డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి ప్రభుత్వం మీద బురద జల్లడానికి వైసీపీ చేసిన ప్రయత్నం నీచ రాజకీయాలకు నిదర్శనం. మానవత్వం తెలియని నేతలు తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చున్నారు. ఇటువంటి నరరూప రాక్షసులను ప్రజాసమాజం నుంచి వెలివేయాలి" అన్నారు.

చిత్తూరు జిల్లా వెదురుకుప్పలో అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేయడం దళితుల మనోభావాలపై దాడి చేయడమేనని పేర్కొన్నారు. ఈ ఘటనలో వైసీపీ నేతలు గోవిందయ్య తదితరులు అరెస్టై జైలుకెళ్లినా జగన్ మౌనంగా ఉండటం దేనికి సంకేతమని ప్రశ్నించారు.

మిగతా 2లో...




## "ఆటో డ్రైవర్ల సేవలో ".. మైనారిటీలకు రూ.41.37 కోట్లు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన "ఆటో డ్రైవర్ల సేవలో" పథకంలో భాగంగా మైనారిటీల వర్గాలకు చెందిన డ్రైవర్లకు రూ. 41.37 కోట్లు లబ్ధి చేకూరిందని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మంగళవారం అమరావతి లో విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో కూటమి ప్రభుత్వం

మిగతా 2లో...

## ఈ-క్రాప్ నమోదు గడువు పొడిగింపు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ నమోదు గడువును ప్రభుత్వం ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించింది. సామాజిక తనిఖీ, సవరింపులు, మార్పుచేర్పులకు ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ-క్రాప్ తుది జాబితాను ఈ నెల 31న రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్లు వివరించారు. గతంలో ఈ-క్రాప్ నమోదుకు వెళ్తే సాంకేతిక సమస్య వల్ల నమోదు చేయలేదని, ఇప్పుడు అటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ప్రభుత్వం గడువు పెంచినందుకు తమకు మంచి జరుగుతుందని రైతులు చెబుతున్నారు.

రైతులు పండించిన పంటల సేకరణ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లింపునకు ప్రభుత్వం ఈ-క్రాప్‌ను ప్రామాణికంగా తీసుకుంటోంది. పంటల సాగు ప్రారంభమై రెండు నెలలు దాటినా కూడా కృష్ణా జిల్లాలో ఈ-క్రాప్ నమోదు అనుకున్న స్థాయిలో జరగడం లేదని రైతులు చెబుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వ్యవసాయశాఖ సహాయకుల బదిలీలు రైతులకు శాపంగా మారాయి. ప్రభుత్వం తొలుత సెప్టెంబర్ నెలాఖరుకు గడువు తేదీని నిర్దేశించింది. జిల్లాలో ఈ-క్రాప్ నమోదులో ఇబ్బందులు తలెత్తడం వల్ల పంట నమోదు ముందుకు సాగలేదు.

ప్రారంభం నుంచి కూడా పంట నమోదు ప్రక్రియ రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. నమోదుకు రైతు సేవా కేంద్రాల చుట్టూ అన్నదాతలు ప్రదక్షణలు చేస్తున్నారు.

2లో...

## రాష్ట్రంలో నూతన బీసీ గురుకులాల ఏర్పాటు



(మొదటి పేజీ తరువాయి)

రాజ్య పరిపాలన ఎలా చేయాలో రామాయణం చదివితే చాలని విదేశీయులు సైతం భావిస్తుంటారన్నారు.

**వాల్మీకులను ఎస్టీల్లో చేరుస్తాం... :** వాల్మీకుల అభివృద్ధి సీఎం చంద్రబాబునాయుడితోనే సాధ్యమని మంత్రి సవిత స్పష్టంచేశారు. వాల్మీకులను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధే టీడీపీ ధ్యేయమన్నారు. ఎందరో వాల్మీకి సామాజిక వర్గ నేతలకు మంత్రిగా ఎంపీగా, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, ఇతర ప్రజాప్రతినిధులుగా సీఎం చంద్రబాబునాయుడు అవకాశమిచ్చారన్నారు. రాష్ట్ర పండుగగా వాల్మీకి జయంతిని నిర్వహించేలా 2014–19లో సీఎం చంద్రబాబు శాశ్వత జీవో తీసుకొచ్చారన్నారు. సత్యపాల్ కమిటీ నివేదిక మేరకు 2014–19 మధ్య వాల్మీకులను ఎస్టీలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. వాల్మీకులను ఎస్టీల్లో చేర్చేలా కృషి చేస్తామని మంత్రి సవిత స్పష్టం చేశారు.

**మరిన్ని బీసీ గురుకులాల ఏర్పాటు :** బీసీల విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని మంత్రి సవిత వెల్లడించారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో మరిన్ని బీసీ గురుకుల పాఠశాలల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉన్నత విద్య చదివే బీసీ విద్యార్థులకు పావలా వడ్డీకే విద్యా రుణాలు అందజేయనున్నామన్నారు. ఇందుకు ప్రభుత్వమే బ్యాంకు గ్యారంటీగా ఉంటుందన్నారు. ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా శిక్షణ పొందిన బీసీ అభ్యర్థులు 250 మంది వరకూ టీచర్లగా నియమితులయ్యారన్నారు.

**బీసీలను వ్యాపారులుగా చేయడమే లక్ష్యం :** ప్రతి బీసీ ఇంటి నుంచి ఒకరిని వ్యాపారవేత్తగా చేయడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. ఇందుకోసం స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సూపర్ సిక్స్ పథకాలలోనూ, మెగా డిఎస్సీలోనూ, జీఎస్టీలోనూ ఎక్కువ లబ్ధి చేకూరింది బీసీలకేనన్నారు. ఈ సమావేశంలో ఎంపీలు బస్తిపాటి నాగరాజు, అంబిక లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, గౌరు చరితారెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, కార్పొరేషన్ చైర్మన్లు దేవేంద్రప్ప, కప్పట్రాళ్ల బొజ్జమ్మ, కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి, కడప ఆర్టీసీ రీజినల్ చైర్మన్ పూలనాగరాజు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు, వాల్మీకి సామాజిక వర్గీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కల్తీ మద్యం నిందితులను వదలం

(మొదటి పేజీ తరువాయి)

ఎంతటి వాళ్లు ఉన్నా విడిచిపెట్టం, అవసరమైతే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తాం. కల్తీ మద్యం తయారీని గుర్తించింది ఎక్సైజ్ అధికారులే. నిరంతరం పర్యవేక్షిస్తున్నాం కాబట్టే కల్తీ మద్యాన్ని గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకున్నాం. మా పార్టీ వాళ్లు ఇద్దరు ఉన్నారని తెలిసిన వెంటనే.. వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేసి కేసులు నమోదు చేయించాం. వారు ఎన్నికల ముందు మాత్రమే మా పార్టీలోకి వచ్చారు. కల్తీ మద్యంపై శాఖాపరంగా సమగ్ర విచారణ జరుగుతోంది. బాధ్యులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం" అని కొల్లు రవీంద్ర అన్నారు.

## వైసీపీని రాష్ట్రం నుంచి బహిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి)

"దళితులంటే జగన్‌కు గిట్టదు. ఆయన పాలనలో దళితులపై 56 వేల దాడులు, 192 హత్యలు జరిగాయని కేంద్రం రాజ్యసభలో వెల్లడించింది. సొంత పార్టీలోనే దళిత ఎమ్మెల్యేలను చెప్పులు లేకుండా తాడేపల్లికి రావాలని బలవంతం చేశారు. కరోనా సమయంలో మాస్క్ అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్‌ను హత్య చేశారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యంను చంపి డోర్ డెలివరీ చేశారు. సింగయ్యను కారు ఎక్కించి తొక్కించి చంపించారు. ఇవన్నీ జగన్ మానవత్వహీన పాలనకు నిదర్శనాలు" అని నక్కా ఆనంద్ బాబు మండిపడ్డారు.

"కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం నెలకొంది. కానీ జగన్ రెడ్డి మళ్లీ అశాంతి సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నారు. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారు. ఇలాంటి దిగజారుడు రాజకీయాలు మానుకొని హుందా రాజకీయాలు చేయాలని జగన్ రెడ్డికి హితవు పలుకుతున్నాను" అని నక్కా ఆనంద్ బాబు తెలిపారు.

## జగన్ కల్తీ లిక్కర్‌పై మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టే: సోమిరెడ్డి



**తిరుపతి(జర్నలిస్ట్ ఫైల్) :** మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సీఎం జగన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కల్తీ లిక్కర్ అంశంపై జగన్ చేసిన వ్యాఖ్యలు విన్నాక దెయ్యాలు వేదాలు వల్లించినట్టే అనిపిస్తుందని ఆయన ఎద్దేవా చేశారు.

"దేశంలోనే ఎక్కడా లేని విధంగా రూ.3500 కోట్ల లిక్కర్ స్కామ్‌తో ప్రజల ప్రాణాలతో ఆడుకున్న ప్రభుత్వం జగన్‌ది. అక్రమార్జన కోసం నాణ్యతలేని జే బ్రాండ్స్ మద్యం సరఫరా చేసి వేలమంది ప్రాణాలు తీశారు, లక్షల మందికి ఆరోగ్య ప్రమాదం కలిగించారు. ఎన్నో కుటుంబాలను ఆర్థికంగా నాశనం చేశారు. ఇలాంటి వ్యక్తి ఇప్పుడు లిక్కర్ పాలసీని సమర్థించుకోవడం మితిమీరిన అబద్ధం," అని వ్యాఖ్యానించారు.

జగన్ ప్రభుత్వాన్ని "క్యాష్ అండ్ క్యారీ సిస్టమ్‌తో జే బ్రాండ్ మద్యం తప్ప తాగొద్దు అనే షరతు పెట్టి ప్రజలను విపరీతంగా ఇబ్బంది పెట్టిందని" సోమిరెడ్డి విమర్శించారు. "ప్రజల బిడ్డ అంటూ మీరు బుడ్డ ముంచారు. మద్యం తయారీ, సరఫరా, అమ్మకాలు అన్నీ మీ చేతుల్లో పెట్టుకుని వేల కోట్ల కుంభకోణాలు చేశారని" ఆరోపించారు.

తమ ప్రభుత్వం కాలంలో నకిలీ మద్యం సమాచారం రాగానే దాడులు చేసి, అరెస్టులు జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకున్నామని చెప్పారు. "చట్టం పట్ల, ప్రజారోగ్యం పట్ల మా చిత్తశుద్ధి నిరూపితమైందని" తెలిపారు.

ప్రజలకు కావలసిన మద్యం రకాలు అందుబాటులో ఉంచడం, డిజిటల్ చెల్లింపుల్లో పారదర్శకత తీసుకురావడం కూటమి ప్రభుత్వ లక్ష్యం అని చెప్పారు. "నిత్యం నేరగాళ్లకు ఆశ్రయం ఇచ్చి ఐదేళ్లు అరాచకాలకు పాల్పడిన మీరు ఎన్ని జన్మలెత్తినా ఆ పాపాలు కడుక్కోలేరు జగన్," అని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.

# హైస్పీడ్ కారిడార్‌కు గ్రీన్ సిగ్నల్..?

(మొదటి పేజీ తరువాయి)

మరికొన్ని చోట్ల ఆరు వరుసలుగా మాత్రమే ఉండటంతో వాహనాలు వేగంగా కదలలేకపోతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ కొత్త కారిడార్‌పై ఎలైన్‌మెంట్ కసరత్తును ప్రారంభించింది.

ఈ హైస్పీడ్ కారిడార్ ఖరగ్‌పూర్ నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా చెన్నై వరకు దీనిని నిర్మించనున్నారు. ఈ మార్గం ప్రకాశం, నెల్లూరు జిల్లాల మీదుగా కొనసాగి చెన్నై చేరుతుంది. అమరావతి అవుటర్ రింగ్ రోడ్‌తో అనుసంధానం కావడంతో రాష్ట్ర రాజధాని రవాణా రంగంలో ప్రధాన కేంద్రంగా మారనుంది. రాజధానిలో ఏర్పడుతున్న కొత్త సంస్థలు, పెరుగుతున్న వాహన రాకపోకలను దృష్టిలో ఉంచుకుంటే, ఈ హైస్పీడ్ కారిడార్ ప్రాజెక్ట్ రాష్ట్రానికి గేమ్‌చేంజర్‌గా మారనుంది.

ఇక మూలపేట పోర్టు నుంచి విశాఖపట్నం వరకు 165 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ కోస్టల్ కారిడార్ ప్రణాళికలో ఉంది. 6 లేదా 8 వరుసల రహదారిగా నిర్మించేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఇప్పటికే DPR సిద్ధం చేస్తోంది.



దీని అంచనా వ్యయం సుమారు రూ.8,300 కోట్లు. ఈ కోస్టల్ కారిడార్‌ను హైస్పీడ్ కారిడార్‌లో భాగం చేయాలనే ఆలోచన కేంద్రానికి ఉన్నా, తాజా ప్రణాళికల్లో మార్పులు వస్తున్నాయి. సముద్రతీరం కాకుండా, లోపల వైపు కొత్త ఎలైన్‌మెంట్ పైనే మోర్త్ దృష్టి సారించింది.

దిల్లీలో మోర్త్ ఉన్నతాధికారులు ఎలైన్‌మెంట్ల తయారీని సమీక్షిస్తున్నారు. మరో నెలలో స్పష్టత రానుంది. తర్వాత ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చలు జరిపి, వారి సమ్మతి తీసుకుని తుది రూపురేఖలు ఖరారు చేస్తారు. అప్పటికి భూసేకరణ అవసరాలు, మొత్తం వ్యయం, ప్రాజెక్ట్ నిర్మాణ సమయానికి సంబంధించి పూర్తి సమాచారం వెలువడనుంది.

ఈ హైస్పీడ్ కారిడార్ అమలులోకి వస్తే వాహనదారులకు పెద్ద ఊరట లభించడమే కాకుండా, కొత్త ప్రాంతాల అభివృద్ధికి కూడా తోడ్పడనుంది. అమరావతి చుట్టూ నిర్మిస్తున్న అవుటర్ రింగ్ రోడ్ ఏకకాలంలో ఏడు జాతీయ రహదారులను కలుపుతూ రాష్ట్ర రవాణా వ్యవస్థను కొత్త దశలోకి తీసుకువెళ్తుంది. ఉత్తర, దక్షిణ భారతదేశాన్ని అనుసంధానించే ఈ కొత్త రహదారి, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గుర్తింపుని తీసుకురానుంది.

కేంద్రం నిర్మించబోతున్న ఈ కొత్త ప్రాజెక్ట్ ద్వారా పరిశ్రమలు, లాజిస్టిక్స్, వాణిజ్య రంగం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. సరకు రవాణాకు సమయం తగ్గి, రవాణా వ్యయాలు కూడా తగ్గుతాయి. అనేక ప్రాంతాలు కొత్త రహదారి ద్వారా అనుసంధానమవడంతో స్థానిక ఆర్థిక వ్యవస్థలు చురుకుగా మారతాయి. భవిష్యత్తులో ఈ కారిడార్ రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించే ప్రధాన బలంగా మారనుంది.

# హైవే ప్రయాణం ఇక సులభం

(మొదటి పేజీ తరువాయి)

ఎన్‌హెచ్‌ఏఐ ప్రత్యేక సదుపాయాన్ని అందిస్తోంది. కార్లు, జీపులు, వ్యాన్లు వంటి వాహనాల యజమానులు రూ.3,000 చెల్లించి ఏడాదికి 200 ఉచిత ప్రయాణాలు చేయవచ్చు. దీని కోసం రాజ్‌మార్గ్ యాత్ర యాప్ లేదా ఎన్‌హెచ్‌ఏఐ వెబ్‌సైట్ ద్వారా చెల్లింపులు చేయాలి. ఈ పథకం వాణిజ్య వాహనాలకు వర్తించదు. రాష్ట్ర హైవేలు లేదా ఓఆర్‌ఆర్ పై ఇది అమలు కాదు.

స్థానిక టోల్‌పాస్ – రోజువారీ ప్రయాణికులకు ఊరట: ఇంటి దగ్గరే టోల్‌గేటు ఉండి రోజూ దాన్ని దాటాల్సి వస్తే ఖర్చు ఎక్కువ అవుతుంది. దీనికి పరిష్కారంగా ఎన్‌హెచ్‌ఏఐ "లోకల్ టోల్‌పాస్" సదుపాయం కల్పించింది. టోల్‌ప్లాజాకు వెళ్లి ఆధార్ ఇస్తే చిరునామా ధ్రువీకరించి ఫాస్టాగ్ ఖాతాకు లోకల్ పాస్ అనుసంధానం చేస్తారు. దీని కోసం రూ.200 నుంచి రూ.350 వరకు చెల్లించాలి. ఇది ఆ టోల్‌గేటుకు మాత్రమే వర్తిస్తుంది.

3 నిమిషాల నియమం – టోల్‌ప్లాజా వద్ద కొత్త విధానం: టోల్‌ప్లాజాల వద్ద పెద్ద క్యూలైన్లు సాధారణం, ముఖ్యంగా పండగల సమయంలో. ఈ సమస్యను తగ్గించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ 3 నిమిషాల నియమాన్ని అమలు చేసింది. టోల్ సిబ్బంది వాహనం వచ్చిన 3 నిమిషాల్లోపే ఛార్జీలు వసూలు చేయాలి. ఆ సమయం దాటినా వాహనదారుడు



టోల్ ఫీజు చెల్లించాల్సిన అవసరం ఉండదు. సిబ్బంది ప్రవర్తనపై అసంతృప్తి ఉంటే రాజ్‌మార్గ్ యాత్ర యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

అంబులెన్స్ సేవలు – ప్రమాదాల సమయంలో త్వరిత సాయం: ప్రమాదాలు జరిగినప్పుడు సహాయం పొందేందుకు జాతీయ రహదారుల్లో ప్రత్యేక అంబులెన్స్ సేవలు ఏర్పాటు చేశారు. ఎక్కడైనా ప్రమాదం జరిగితే 1033 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేస్తే సమీప టోల్‌ప్లాజాకు సమాచారం వెళ్తుంది. అక్కడి నుంచి అంబులెన్స్ 15 నిమిషాల్లో సంఘటనా ప్రదేశానికి చేరుకుంటుంది. ఈ నంబర్ ద్వారా ఫాస్టాగ్ సమస్యలు లేదా సిబ్బంది ఫిర్యాదులు కూడా నమోదు చేయవచ్చు.

హైవేల్లో నిఘా వ్యవస్థ – వేగం పరిమితి అమలు: జాతీయ రహదారులపై గంటకు 100 కి.మీ. కంటే ఎక్కువ వేగం నిషేధం. ఎక్స్‌ప్రెస్‌వేలలో ఇది 120 కి.మీ. వరకు ఉంటుంది. ఈ పరిమితులను అతిక్రమించే వాహనాలను గుర్తించేందుకు ఏటీఎంఎస్ అమలులో ఉంది. ఈ సాంకేతికతతో వేగం కొలుస్తారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానాలు విధిస్తారు.

టోల్‌ప్లాజాల్లో తప్పనిసరి సదుపాయాలు: జాతీయ రహదారులపై ఉన్న ప్రతి టోల్‌ప్లాజాలో ఈ సదుపాయాలు తప్పనిసరి. పురుషులు, మహిళలకు వేర్వేరు మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం, ప్రథమ చికిత్స కిట్లు, చెత్త బుట్టలు, డ్రైవర్లకు విశ్రాంతి స్థలం, ప్రమాదాల సమయంలో క్రేన్ సాయం, అత్యవసర కాల్స్ కోసం ఫోన్ సదుపాయం. ఈ అన్ని సదుపాయాలు ప్రయాణికుల సౌకర్యం, భద్రత కోసం ఏర్పాటు చేశారు. రాజ్‌మార్గ్ యాత్ర యాప్ ప్రయాణికులకు డిజిటల్ మార్గదర్శి. ఫాస్టాగ్ నుంచి ఎమర్జెన్సీ వం–కు అన్నీ ఈ యాప్‌లో లభిస్తాయి. జాతీయ రహదారులపై ప్రయాణం ఇక భద్రతా, సౌకర్యాలతో కూడిన అనుభవంగా మారింది.

# ఈ-క్రాప్ నమోదు గడువు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

రైతులు క్షేత్రస్థాయిలో సాగు చేసిన పంటలను పరిశీలించి వాటి వివరాలను వీవీఏలు ఈ-క్రాప్ నమోదు చేయాల్సి ఉంది. ఈ సీజన్ ప్రారంభంలో ఉమ్మడి కృష్ణా జిల్లాలో 475 మంది వీవీఏలను బదిలీ చేశారు. జిల్లాలో 3,55,824 హెక్టార్లలో రైతులు ఖరీఫ్‌ను సాగు చేస్తున్నారు. ఈసారి ఈ-కేవైసీని నోటిఫైడ్ పంటలకు మాత్రమే పరిమితం చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంకా వ్యవసాయ, ఉద్యాన, పట్టు, సామాజిక అడవులు, సాగు చేయని బీడు భూములను ఈ-పంటలో నమోదు చేయాల్సి ఉంది. సచివాలయ ఉద్యోగులు బదిలీ కావడం, కొత్త ప్రాంతాల్లో సిబ్బంది భూ సర్వే నంబర్లు గుర్తించలేకపోవడం, గత రెండు నెలలు అధికారులు యూరియా సరఫరాపైనే పూర్తిస్థాయిలో దృష్టి పెట్టడం, సాంకేతిక సమస్యలు వంటి కారణాలతో ఈ-క్రాప్ నమోదులో ఇబ్బందులు తలెత్తాయని రైతులు చెబుతున్నారు.

పంట నమోదులో జాప్యం జరిగి తాము పంటను ఈ-క్రాప్ చేయించుకోలేకపోతే తర్వాత ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తుందని గతంలో జరిగిన



ఘటనలను గుర్తుకు తెచ్చుకుని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో తాము పెట్టిన పెట్టుబడి గంగలో కలిసిపోతుందన్నారు. తమకు ఆర్థికంగా భరోసా ఇచ్చేందుకు ప్రభుత్వం కొంత నష్టపరిహారం ఇస్తుందని అంటున్నారు. ప్రభుత్వం ఇచ్చే పరిహారం తమకు కొంత ఉపసమనంగా ఉంటుందన్నారు. ఈ-క్రాప్ నమోదు చేయకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే లబ్ధి తమకు అందదని వాపోతున్నారు.

కృష్ణా జిల్లాలో ఈ పంట నమోదు దాదాపు 90 శాతం వరకు పూర్తయిందని అధికారులు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి పూర్తి భిన్నంగా ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. పంట నమోదు కోసం రైతు సేవా కేంద్రాలకు వెళ్తే అక్కడ సిబ్బంది అందుబాటులో ఉండటం లేదంటున్నారు. ఒకవేళ్ల సిబ్బంది ఉన్నా సర్వర్ సమస్య ఉందంటూ పంట నమోదు చేయడంలో ఇబ్బందులు వస్తున్నాయని చెబుతున్నారు. ప్రభుత్వం చేపట్టిన మంచి ఆలోచనకు ఉద్యోగులు సహకారం అందిస్తేనే తమకు మంచి జరుగుతుందని అన్నదాతలు అంటున్నారు.

ఈ-క్రాప్‌లో పంట నమోదుకు సమయం ఇవ్వడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే నమోదు కోసం రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని అందుబాటులో ఉంచి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పంట నమోదు జరిగితే అనుకోని ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో తమకు ఆర్థికంగా కొంత వెసులుబాటు వస్తుందని చెబుతున్నారు.

# ట్రూ డౌన్‌తో తగ్గనున్న విద్యుత్ బిల్లుల భారం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో ట్రూ అప్ పేరిట విద్యుత్తు బిల్లుల బాదుడు గురించి వినియోగదారులందరికీ తెలిసిన విషయమే. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్నటువంటి కూటమి ప్రభుత్వం తొలిసారిగా 'ట్రూ డౌన్' పేరిట బిల్లుల భారం తగ్గిస్తోంది. ఈ ప్రక్రియ నవంబరు నుంచి తగ్గింపు ప్రయోజనాలతో అందుబాటులోకి రానున్నాయి. దీంతో ప్రకాశం జిల్లా పరిధిలో రూ.22.13 కోట్ల మేర ఉపశమనం లభించనుంది. విద్యుత్తు ఛార్జీలు పెంచబోమనీ, అవసరమైతే తగ్గిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఈ చర్యలు తీసుకున్నారు.

**యూనిట్‌కు 13 పైసలు తగ్గింపు:** ప్రకాశం జిల్లాలో ఉచిత విద్యుత్తు ఇస్తున్న వ్యవసాయ కనెక్షన్లను మినహాయిస్తే ఇతర కనెక్షన్లు దాదాపు 13.62 లక్షలు ఉన్నాయి. తద్వారా 2024–25 ఆర్థిక సంవత్సరంలో 1,648 మిలియన్ యూనిట్ల వినియోగం జరిగడం గమనార్హం. ముఖ్యంగా విద్యుత్తు కొనుగోళ్లు, సరఫరా, పంపిణీ నష్టాలు, ఇతర వ్యయాలతో కలిపి ఎఫ్‌పీపీసీఏ కింద ట్రూ అప్ పేరిట యూనిట్‌కు 40 పైసలు చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గతేడాది జరిగిన కొనుగోళ్లు, వాస్తవ లెక్కలపై కూటమి ప్రభుత్వం సమీక్షించింది.




అదనంగా వసూలు చేసిన మొత్తంలో కొంత వినియోగదారులకు తిరిగి ఇవ్వాలని నిర్ణయించింది. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు జరిగిన విద్యుత్తు వినియోగం ఆధారంగా యూనిట్‌కు 13 పైసలు చొప్పున తగ్గించనున్నారు. నవంబరు నుంచి ఏడాది పాటు (అక్టోబర్–2026 వరకు) ఈ మేరకు తగ్గించి బిల్లులు ఇవ్వనున్నారు. ఈ ట్రూ డౌన్ విధానం ద్వారా జిల్లాలో ఉన్న వినియోగదారులకు రూ.22.13 కోట్ల మేర లబ్ధి చేకూరనుందని విద్యుత్తు శాఖ అధికారులు తెలిపారు.

**జిల్లాలో ఉన్న సర్వీసుల వివరాలు**

గృహ : 11,91,599

వాణిజ్య: 1,34,271

పరిశ్రమలు: 32,080

ఇతర: 4,963

విద్యుత్ రంగం బలోపేతంపై సీఎం దృష్టి : విద్యుత్ రంగాన్ని బలోపేతం చేయడంపై సీఎం చంద్రబాబు దృష్టిపెట్టారని మంత్రి రవికుమార్ పేర్కొన్నారు. గడచిన 15 నెలల్లో అనేక సంస్కరణలు తీసుకొచ్చి వ్యవస్థను గాడిలో పెట్టామని ఆయన అన్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో 17.8%గా ఉన్న స్వల్పకాలిక విద్యుత్ కొనుగోళ్లను కూటమి ప్రభుత్వం 6.8%కు తగ్గించిందని గుర్తు చేశారు. పీక్ డిమాండ్ సమయంలో అవసరమైన విద్యుత్తును శ్వాపింగ్ విధానంలో పంజాబ్, హరియాణా నుంచి ఇచ్చిపుచ్చుకునే విధానంలో తీసుకుంటున్నామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. జెన్‌కో థర్మల్ కేంద్రాల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 90 శాతానికి పెంచాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఇన్నాళ్లూ యూనిట్‌కు 40 పైసల చొప్పున వసూలు చేస్తున్న ఇంధన సర్దుబాటు ఛార్జీలను తగ్గించే ప్రయత్నం కూటమి ప్రభుత్వం చేస్తోందని విద్యుత్‌శాఖ గొట్టిపాటి రవికుమార్ వివరించారు.

## "ఆటో డ్రైవర్ల సేవలో ".. మైనారిటీలకు రూ.41.37 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఆటో డ్రైవర్ల సేవలో పథకం అమలు లో 27,580 మంది లబ్ధిదారులకు రూ.15,000 ప్రకారం వారి వారి అకౌంట్లకు ప్రభుత్వం నేరుగా జమ చేయడం జరిగిందని తెలిపారు. వైసిపి ప్రభుత్వ హాయంలో మైనారిటీ వర్గాలకు చెందిన డ్రైవర్లకు ఒక్కొక్కరికి కేవలం రూ.10,000 ప్రకారం 24,393 మందికి రూ.24.39 కోట్లు మాత్రమే ఇవ్వడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన నేపథ్యంలో ఏర్పడిన ఇబ్బందుల నుండి తప్పించేందుకు అర్హులైన ఆటో, తదితర డ్రైవర్లకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు ప్రభుత్వం "ఆటో డ్రైవర్ల సేవలో " పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా 3977 మందికి, బీసీ కార్పొరేషన్ ద్వారా (బి.సి –ఈ ముస్లింలకు)22,975 మందికి, క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా 628 మంది మైనారిటీలకు "ఆటో డ్రైవర్ల సేవలో" పథకంలో భాగంగా ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. గత వైసిపి ప్రభుత్వం కంటే 70 శాతం మొత్తం అధికంగా కూటమి ప్రభుత్వం చెల్లించినట్లు తెలిపారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమ కార్యక్రమాలను,పథకాలను అమలు చేస్తున్నదని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

## తెలంగాణలో పార్టీ కమిటీల నియామకంపై చర్చ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ తెలుగుదేశం నేతలతో పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమావేశం అయ్యారు. తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన నేతలతో సీఎం క్యాంప్ కార్యాలయంలో చంద్రబాబు సమావేశం అయ్యారు. సుదీర్ఘ కాలం తరువాత చంద్రబాబుతో తెలంగాణ తెలుగుదేశం నేతలు సమావేశమయ్యారు. తెలంగాణ రాష్ట్ర టీడీపీ అధ్యక్షుని ఎంపిక, పార్టీ సంస్థాగత నిర్మాణంపై సమావేశంలో చర్చించారు. ఇప్పటికే కసరత్తు పూర్తయిన నేపథ్యంలో తెలంగాణలో మండల అధ్యక్షుల నియామకాలు పూర్తి చేయాలని సమావేశంలో నేతలు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర అధ్యక్షునితో పాటు స్టేట్ కమిటీని నియమించాలన్న అంశంపైనా సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. పార్టీ బలోపేతంలో భాగంగా రెండు మూడు రోజుల్లో 638 మండల కమిటీలు, డిజవిన్ కమిటీల నియామకం పూర్తి చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. తరువాత పార్లమెంట్ కమిటీలను నియమించాలని నిర్ణయించారు. తెలంగాణలో 1.78 లక్షల సభ్యత్వాలు నమోదు చేసినట్లు చంద్రబాబుకు నాయకులు వివరించారు. రాష్ట్ర పార్టీ సంస్థాగత నిర్మాణం పూర్తి చేసి నాయకత్వాన్ని అందించడం ద్వారా....గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీలో యాక్టివ్ గా పనిచేయడానికి కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉన్నారని నాయకులు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడి నియామకం గురించి నేతలు ప్రధానంగా ప్రస్తావించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుని నియామకం ఆలస్యం అయ్యేటట్లు అయితే... ఈ లోపు ముఖ్య నాయకులతో కలిపి రాష్ట్ర స్థాయిలో కమిటీ ఏర్పాటు చేయాలని నాయకులు కోరారు. అందరి అభిప్రాయాలు తీసుకున్న చంద్రబాబు...కమిటీల నియామకం పూర్తి చేసుకుని పార్టీ యాక్టివిటీ పెంచాలని సూచించారు. సమర్థవంతమైన నాయకత్వాన్ని ఇచ్చేవారికి రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు బక్కని నర్సింహులు, అరవింద్ కుమార్ గౌడ్, కంభంపాటి రమ్మోహన్, నన్నూరి నర్సిరెడ్డి, బంటు వెంకటేశ్వర్లు, నందమూరి సుహాసిని, ఆశోక్ గౌడ్, జోత్స్న, వాసిరెడ్డి రామనాథం, పోగాకు జైరామ్ తో పాటు పలువురు హాజరయ్యారు.

## ప్రజల భద్రత దృష్ట్యా జగన్ పర్యటనకు అనుమతి ఇవ్వలేం: విశాఖ సీపీ

**విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్) :** విశాఖలో జగన్ పర్యటనకు అనుమతి లేదని విశాఖ సీపీ శంఖబ్రత బాగ్చి తెలిపారు. "జగన్ పర్యటన రోజే విశాఖలో మహిళల ప్రపంచ కప్ మ్యాచ్ ఉంది. మ్యాచ్‌కు జనం భారీగా హాజరయ్యే అవకాశమున్నందున పోలీసు బందోబస్తు అందించాల్సి ఉంది. విశాఖ నుంచి జగన్ రోడ్ మార్గంలో మాకవం–పాలెం వెళ్లే యోచనలో ఉన్నట్టు చెప్పారు.



వైకాపా శ్రేణులు ర్యాలీగా వెళ్తే జాతీయ రహదారి బ్లాక్ అవుతుంది. రోడ్ బ్లాక్ అయితే తమిళనాడులో విజయ్ ర్యాలీలో జరిగినట్టు తొక్కిసలాట జరగవచ్చు. ప్రజల భద్రత దృష్ట్యా ఆయన పర్యటనకు అనుమతి ఇవ్వలేము. ఇదే విషయాన్ని నేరుగా వారికి లేఖలో తెలియజేస్తున్నాం" అని సీపీ తెలిపారు.

# నాకు చెయ్యి ఇప్పించి చేయూత ఇవ్వండి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్):** గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం తోట్లపాలెం గ్రామానికి చెందిన నక్కా జాన్, విజయలక్ష్మి దంపతులు నిరుపేద వ్యయసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. వీరికి సొంత వ్యవసాయ భూమి లేదు రెక్కలు ఆడితే కాని డొక్కాడని పరిస్థితి ఉంది. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు పెద్ద అమ్మాయికి వివాహం చేసి అత్తవారింటికి పంపించారు చిన్న అమ్మాయి నక్కా ప్రవల్లిక (19 ) కి పుట్టుక తోనే ఎడమ చెయ్యి మొచేతివరకు మాత్రమే ఉంది.. ప్రస్తుతం చిట్టి తల్లి ప్రవల్లిక చేబ్రోలు ఆర్.విఐటి కలాశాలలో ప్రభుత్వ స్కాలర్ షిప్ తో బీటెక్ సిఎస్సి విభాగంలో రెండో సంవత్సరం చదువుతోంది. ప్రవళికకు దివ్యాంగుల కోటాలో రూ. 7 వేలు పింఛన్ వస్తోంది ప్రస్తుతం వైద్య రంగం సాంకేతికంగా ఎంతో ఉన్నత సాధించింది ఏంతో ఎత్తుకు కూడా ఏదిగింది. ఎలాంటి వ్యాధినైనా, శస్త్ర చికిత్సలైనా అవలీలగా చేయగల వైద్యులు ఉన్నారు. తెగి పడి వేరు పడిన కాళు ్ళ చేతులను కూడా రెండు మూడు గంటల సమయం ఆలస్యం అయినా సరే యధావిధిగా పనిచేసే విధంగా అతికిస్తున్నారు ఈ బంగారు తల్లి ప్రవల్లిక చేతి విషయంలోకూడా పేరున్న కార్పొరేట్ వైద్యులు ముందుకు వచ్చి ప్రవల్లిక చేతి కి సరిపోయే మహిళలు ఏవరైనా బ్రెయిన్ డెడ్ అయినా వారి చేతి ని ప్రవల్లికకు అతికించుటకు కల మార్గాలను లేదా మరేదైనా ఆధునిక వైద్య మార్గాలను పరిశీలించి చిట్టితల్లి ప్రవల్లికకు అందరిలా చేయి తీసుకు వస్తే ఆ బంగారుతల్లి ప్రవల్లికతో పాటు అతల్లి తండ్రుల అనందానికి అవధులు ఉండవు ప్రభుతంతోపాటు, రాష్ట్ర డిప్యూటీ సీఎం, పవన్ కళ్యాణ్ , విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాకు ఈ భాగ్యం కలిగించమని ఆ విద్యార్థిని వేడుకుంటోంది అంతేకాక ఎవరైనా దాతలు ముందుకు వస్తే రుణపడి ఉంటానని అంటోంది. అందరిలాగ నాకు చేయి వచ్చే లా వైద్య మార్గాలు ఉంటే చూడాలని వారిని ప్రవల్లిక వేడుకుంటుంది. ప్రవల్లికతో మాట్లాడాలనుకునే పాలకులు, వైద్యులు దాతలు 73966 70809 ఫోన్ నంబర్లో సంప్రదించవచ్చు ప్రవల్లిక ప్రస్తుతం బస్సు లలో కళాశాలకు నిలబడి వెలుతుంది ప్రభుత్వం వెంటనే స్పందించి ఉచితంగా మూడు చక్రాల స్కూటర్ అందించ్చాల్చిన అవసరం కూడా ఉందని పలువురు సూచిస్తున్నారు.

# కల్తీ మద్యానికి మూలవిరాట్ జగనే



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** కల్తీ మద్యం వ్యవహారంలో ఎంతటి వారున్నాచర్యలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపక్రమించారని ఏపీ టీఎస్ చైర్మన్మన్నవ మోహనకృష్ణ మంగళవారం అన్నారు కల్తీ మద్యంపై ఆయన విలేకరులతో మాట్లాడారు ఐదేళ్ల వైసీపీ పాలనలో కల్తీ మద్యం తాగి వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు, లక్షలాది మంది ఆరోగ్యం దెబ్బతింది. తన స్వప్రయోజనాల కోసం జగన్ ప్రతి అంశాన్ని రాజకీయం చేసి లబ్ధి పొందాలని చూస్తున్నారని మన్నవ. విమర్శించారు. ప్రజాసమస్యల పరిష్కారంలో, వారికి అందించే సంక్షేమ పథకాల్లో కూటమి ప్రభుత్వం ఎంత చురుగ్గా పనిచేస్తోందో, ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే, ప్రజలకు చెడుచేసే ఎటువంటి ఘటనలు, అంశాలపై అయినా అంతే వేగంగా స్పందిస్తోంది. అన్నారు. తారతమ్య బేధాలు లేకుండా ప్రజలకు కీడు చేసేవారిని కఠినంగా శిక్షిస్తామని ఇప్పటికే ప్రజా ప్రభుత్వం పలుమార్లు నిరూపించుకుందని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ వ్యాఖ్యానించారు.” 'తాజాగా అన్నమయ్య జిల్లా ములకలచెరువు కల్తీమద్యం ఘటనపై కూడా ప్రభుత్వం చాలా వేగంగా చర్యలకు ఉపక్రమించింది. జగన్ అవకాశవాద రాజకీయాలకు తావులేకుండా వెంటనే చర్యలు చేపట్టింది. కల్తీ మద్యం తయారీ కేసులో 14 మంది పాత్ర ప్రమేయాన్ని గుర్తించిన పోలీస్ శాఖ, 10మందిని అరెస్ట్ చేయడం జరిగింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న టీడీపీనేతలైన జయచంద్రారెడ్డి, సురేంద్ర నాయుడుల ప్రమేయంపై ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించింది. కల్తీ మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అన్నమయ్య జిల్లా టీడీపీ ఇన్ ఛార్జ్ దాసరిపల్లి జయచంద్ర రెడ్డి, టీడీపీ నాయకుడు కట్టా సురేంద్ర ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఇది ప్రభుత్వం , పార్టీ నిబద్ధతకు నిదర్శనం. కల్తీ మద్యంపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. సాక్షి పత్రిక, సోషల్ మీడియాలో జగన్ రెడ్డి కల్తీ మద్యాన్ని తానే కనిపెట్టినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. విజయవాడలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సంబంధిత బార్లో కల్తీ మద్యం తాగి గతంలో ఆరుగురు మరణించినప్పుడు జగన్ ఎందుకు ఆయనను సస్పెండ్ చేయలేదు? కల్తీ మద్యం కేసులో నిందితులుగా ఉన్నవైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని జగన్ ఎందుకు పార్టీ నుంచి సస్పెండ్ చేయలేదు? కల్తీ మద్యం మాఫియాలో జగన్ రెడ్డి భాగస్వాములు కాబట్టి. జే బ్రాండ్ల మద్యంలో విషపూరిత పదార్థాలు ఉన్నట్లు చెన్నై, బెంగళూరు, అమెరికా ప్రముఖ ల్యాబ్లు నిర్ధారించినప్పటికీ, జగన్ అధికారంలో ఉన్నసమయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదు? ఎందుకంటే కల్తీ మద్యం మాఫియాలో భాగస్వామ్యం కాబట్టి. జగన్ హయాంలో జంగారెడ్డి గూడెంలో కల్తీ సారా తాగి 27 మంది పేదలు మరణిస్తే, చర్యలు తీసుకోకుండా, అసెంబ్లీ సాక్షిగా నెలకు 60-70 మంది చనిపోవడం సాధారణమని, ఇవి సాధారణ మరణాలని మాట్లాడిన వ్యక్తి జగన్... ఇప్పుడు కల్తీ మద్యం గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. జగన్ ఐదేళ్ల పాలనలో విషపూరిత మద్యం తయారు చేసి రూ. 3500 కోట్లు కొల్లగొట్టారు. ఈ మద్యం వల్ల నరాల వ్యాధులు, కిడ్నీ, కాలేయ వ్యాధులతో 30,000 మంది పేదలు మరణించారు, 35 లక్షల మంది ఆరోగ్యం దెబ్బతింది. జగన్ పాలనలో 40 లక్షల బెల్ట్ షాపులు నడిచాయి. కానీ, మద్యం అక్రమ సరఫరాను అడ్డుకునేందుకు ప్రభుత్వం గతంతో పోలిస్తే మరింత కఠినంగా వ్యవహరిస్తోంది. తప్పు చేస్తే ఎంతటి వారికైనా వదిలే ప్రసక్తే లేదు అనే విధంగా చంద్రబాబునాయుడు గారు చర్యలు తీసుకోవడం జరుగుతోంది.' అని మోహనకృష్ణ పేర్కొన్నారు.

# రామ్మూర్తినాయుడు ప్రథమ వర్ధంతి



**నారావారిపల్లె (జర్నలిస్ట్ ఫైల్)** :విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లెలో నిర్వహించిన దివంగత నారా రామ్మూర్తినాయుడు ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్నారు. నారావారిపల్లెలోని తమ నివాసంలో బాబాయి రామ్మూర్తినాయుడు ప్రథమ వర్ధంతికి సంబంధించిన క్రతువులో పాల్గొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి రామ్మూర్తినాయుడు స్మృతివనం వద్ద నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నారా, నందమూరి కుటుంబ సభ్యులతో పాటు పలువురు టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరిస్థితులు నియంత్రణకు స్థానికులు భాగస్వామ్యం కావాలి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** తురకపాలెంలో అనారోగ్య పరిస్థితులు నియంత్రణకు స్థానికులు భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. తురకపాలెంలో జిల్లా కలెక్టర్ మంగళవారం పర్యటించారు. గ్రామస్తులతో రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో పాల్గొన్నారు. తురకపాలెం ఆరోగ్య స్థితి గతుల పట్ల ప్రతీ రోజూ పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు.



తురకపాలెం ఆరోగ్య సంరక్షణకు నిలయం కావాలని, అనారోగ్య పరిస్థితులు నియంత్రణకు స్థానికులు భాగస్వామ్యం కావాలని కోరారు. ప్రజలు తమ ఆరోగ్య స్థితి గతుల సమాచారం పక్కాగా అందించాలని సూచించారు. అనారోగ్య పరిస్తితులను విద్లేశించుటకు “రాపిడ్ రెస్పాన్స్ టీమ్” ను ఏర్పాటు చేశామన్నారు. అనారోగ్య పరిస్థితుల్లో ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లాలని చెప్పారు. అనారోగ్యం గురించి వెంటనే సమాచారం అందించడం వలన తక్షణం వైద్యం అందుతుందని చెప్పారు. అనారోగ్య పరిస్థితుల్లో మొదటగా ప్రైవేట్ ఆసుపత్రులకు వెళుతున్నారని, చివరి పరిస్థితుల్లో ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో చేరటం జరుగుతోందని గమనించడం జరిగిందన్నారు. అక్టోబరు 2న వైద్య సిబ్బంది కృష్ణ వేణి గృహానికి వెళ్లగా అనారోగ్యం ఏమి లేదని చెప్పడం జరిగిందని, ఇది సరైన విధానం కాదని స్పష్టం చేశారు. ప్రతీ ఒకరిని కాపాడటమే ధ్యేయంగా ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తుందన్నారు. జ్వరాల సర్వే, సి.డి - ఎన్.సి.డి సర్వే జరుగుతోందని, వైద్య శిబిరాలు నడుస్తున్నాయని వివరించారు. గ్రామంలో 102 మందికి బిపి, 69 మందికి మధుమేహం ఉన్నట్లు ఎన్.సి.డి సర్వేలో గుర్తించామని పేర్కొన్నారు. ఇక ముందు ఒక్క మరణం కూడా సంభవించరాదని ఇందుకు సహకరించాలన్నారు. అభివృద్ధి పనులకు, వేడుకలకు తురకపాలెం నిలయం కావాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ పరంగా అన్ని సౌకర్యాలు అందేటట్లు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎవరికి అనారోగ్యం ఉందో వారికి ప్రజలు అవగాహన కల్పించాలని అన్నారు. అన్ని మందులు అందుబాటులో ఉండుటకు చర్యలు చేపడతామని చెప్పారు. ఇతర ప్రాంతాల నుండి జి.జి.హెచ్ కు ఎన్నో సంవత్సరాలుగా వస్తున్నారని అన్నారు. గ్రామంలో 812 గృహాలు ఉండగా 30 గృహాలకు ఒక కార్యకర్తగా ఉండుటకు స్థానికులు ముందుకు రావడాన్ని అభినందించారు.

స్థానికులు డి.సూర్యప్రకాశ రావు, దాసు, కుమ్మరయ్య, షేక్ వలి, నాగు, ఎం. నాగేశ్వర రావు, కోటేశ్వర రావు, భీమ్ రావు తదితరులు మాట్లాడుతూ క్షేత్ర స్థాయి వైద్య సిబ్బందిని పెంచాలని, అన్ని మందులు అందుబాటులో ఉంచాలన్నారు. గతంలో ఉపయోగించిన బోరును మరమ్మతులు చేసి, నీటి పథకాన్ని జెండా చెట్టు దగ్గర ఏర్పాటు చేయాలని కోరారు. వైద్య సిబ్బంది బాగా పని చేశారని, కారణాలు త్వరగా విశ్లేషించాలన్నారు. కాళ్ల మీద చీము గడ్డలు మహిళలకు ఎక్కువగా వస్తుందని, చనిపోయిన వారిలో ఇదే పరిస్థితి ఉందన్నారు. చనిపోయిన వారి కుటుంబాలకు, వైద్యం చేయించుకుని ఆర్థికంగా వెనుకబాటుకు గురైన వారికి నష్టపరిహారం అందుటకు కృషి చేయాలని కోరారు. కొన్ని కుటుంబాలకు రక్త పరీక్షల ఫలితాలు ఇంకా ఇవ్వలేదని తెలిపారు. చనిపోయిన బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. తాగు నీటి సమస్యగానే అనుమానాలు ఉన్నాయన్నారు.

ఈ గ్రామ సభలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సిరిమానోత్సవం - పైడిమాంబ నినాదాలతో మారుమోగిన వీధులు

**విజయనగరం(జర్నలిస్ట్ ఫైల్) :** విజయనగరాన్ని ఆధ్యాత్మిక రంగుతో ముంచెత్తుతూ, ఈ ఏడాది కూడా శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం వైభవంగా జరిగింది. దసరా పండుగ ముగిసిన వెంటనే ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ సిరిమానోత్సవం, పైడిమాంబ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టంగా నిలుస్తుంది. ఆధ్యాత్మికత, విశ్వాసం, సాంప్రదాయం, శ్రద్ధల సమ్మేళనంగా జరిగిన ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు లక్షలాది మంది భక్తులు విజయనగరానికి తరలివచ్చారు.



సిరిమానుపై అమ్మవారి ఊరేగింపు: సిరిమానోత్సవం చదరగుడి ప్రధాన ఆలయంలో తొలేళ్ల పూజలతో ప్రారంభమయ్యాయి. తర్వాత సాంప్రదాయ ప్రకారం పైడితల్లి అమ్మవారు సిరిమాను రూపంలో ఊరేగారు. పూజారి వెంకటరావు సిరిమానును అధిరోహించి, దేవీ శక్తిని ప్రతిబింబించేలా చదరగుడి నుంచి విజయనగరం కోట వరకు మూడు పర్యాయాలు ఊరేగించారు. సిరిమాను ముందు పాలధార, తెల్ల ఏనుగు, జాలరివల, అంజలి రథం ఊరేగాయి. భక్తుల “జై పైడిమాంబ, జై జై పైడిమాంబ” నినాదాలతో వీధులు మారుమోగాయి.

భక్తుల సందడి: విజయనగరం కోట వీధులు ఈ ఉత్సవంతో పూర్తిగా భక్తి మయంగా మారాయి. ఎత్తైన భవనాలపైకి ఎక్కిమరీ సిరిమాను సంబరాన్ని తిలకించిన ప్రజలు ఆ క్షణాలను మరపురానివిగా మలచుకున్నారు. మూడవ పర్యాయం ఊరేగింపులో సిరిమాను విజయనగరం కోటలోని శక్తి పీఠానికి చేరి ప్రణామం చేసింది. తర్వాత తిరిగి చదరగుడి ప్రధాన ఆలయానికి చేరి ఉత్సవం ముగిసింది. ఇది సంవత్సరాలుగా కొనసాగుతున్న సాంప్రదాయ ప్రక్రియ.

ప్రముఖుల హాజరు - దైవదర్శనం: ఈ సిరిమానోత్సవాన్ని గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు తిలకించారు. ఆయనతో పాటు కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. మంత్రులు అనిత, కొండపల్లి శ్రీనివాస్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అదే విధంగా, మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ కూడా సిరిమానోత్సవాన్ని తిలకించారు. తిలకిస్తుండగా వేదికపై స్వల్ప అపశ్రుతి చోటుచేసుకున్నప్పటికీ, ఎవరూ గాయపడలేదు. సీఐ అశోక్కి స్వల్ప గాయం కాగా, పెద్ద ప్రమాదం జరగకుండా అధికారులు వెంటనే పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు.

అసలు ఎవరీ పైడితల్లి?: ఉత్తరాంధ్ర ప్రజల కల్పవల్లి పైడితల్లి అమ్మవారు గజపతుల వంశానికి చెందిన ఆడపడుచు. చారిత్రక ఆధారాల ప్రకారం 18వ శతాబ్దంలో విజయనగరం రాజు బొబ్బిలి రాజుతో యుద్ధం సాగింది. ఆ సమయంలో రాజు సోదరి పైడిమాంబ (పైడితల్లి) మసూచి వ్యాధితో బాధపడుతుండగా, యుద్ధంలో తన అన్న విజయ రామరాజు మరణించిన వార్త విని ఆమె దుఃఖంతో ప్రాణాలు విడిచారు.

తర్వాత ఆమె ఒక సైనికుడు పతివాడ అప్పలనాయుడికి స్వప్నంలో దర్శనమిచ్చి, తన విగ్రహాన్ని ఆ ప్రాంతంలోని సరస్సు దగ్గర కనుగొని ప్రతిష్ఠించాలని ఆదేశించింది. అలా నిర్మించిన ఆలయంలో పైడితల్లి అమ్మవారి పూజలు, ఉత్సవాలు నేటికీ నిరాటంకంగా కొనసాగుతున్నాయి. ఇందులో సిరిమానోత్సవం అత్యంత విశిష్టమైనదిగా, ఆధ్యాత్మిక శక్తికి ప్రతీకగా భావిస్తారు. ప్రతి ఏడాది లక్షలాది మంది భక్తులు విజయనగరానికి చేరి పైడిమాంబ దర్శనం తీసుకుంటారు. సిరిమానోత్సవం ఉత్తరాంధ్ర సంస్కృతికి ప్రతీక.

# సమైక్యంగా మారకద్రవ్యాలను నిరోధిద్దాం

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** గుంటూరులోని. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో మారుతి నగర్ లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో మంగళవారం ఆశా ఆరోగ్యకార్యకర్తలకు మత్తు పదార్థాలు సోషల్ మీడియా దుర్వినియోగం పై వర్క్షాప్ కార్యక్రమాన్ని, నిర్వహించారు




ఈ కార్యక్రమములో ముఖ్య అతిధి గా విచేసిన గుంటూరు జిల్లా ఈగల్ టీం పోలీస్ PV పోతురాజు మాట్లాడుతూ సామజిక బాధ్యతతో మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించాలని, అన్నారు, మాదక ద్రవ్యాలు జీవితాన్ని నాశనం చేస్తాయని, అంతేకాక మనం నిత్యజీవితంలో చాలా మంది విద్యార్థులు యువత మాదక ద్రవ్యాలకు బానిసలై పోతున్నారు అని, సరిఅయిన అవగాహనతో మాదకద్రవ్యాలను కట్టడి చేయవచ్చు అని, మత్తు పదార్థాల వలన విద్యార్థుల జీవితాన్ని నిలువెల్లా నాశనం చేస్తోంది అని, సరదాగా అలవాటు చేసుకొని చివరకు మత్తు పదార్థాలు లేకుండా ఉండలేని పరిస్థితికి వస్తున్నారు అని, గంజాయి మరియు ఇతర నిషేధిత మాదక ద్రవ్యాలు అమ్మినా కొన్నా ఎన్ డి పి ఎస్చట్టప్రకారం నేరమే అని ఈ విషయాలను 1972 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి సమాచారాన్ని ఇవ్వాలని కోరారు

అనంతరం నవజీవన్ జోనల్ కోఆర్డినేటర్ %రా% జాకబ్ రాజు మాట్లాడుతూ మత్తు మైకంలో చదువుకు దూరమవుతూ విలువైన శక్తిని నిర్వీర్యం చేసుకుంటున్నారు అని, ఎవరైనా మాదక ద్రవ్యాల కు బానిసలైన వారిని ముందుగా గుర్తించి, సరి అయిన అవగాహనా, కౌన్సిలింగ్ , డి అడిక్షన్ సెంటర్లకు పంపించాలని ప్రతి ఒక్కరు తమ వంతు సామజిక భాద్యతగా తీసుకుంటే మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించవచ్చు అని అన్నారు

సోషల్ మీడియా కు బానిసలుగా మారిన యువత ఎక్కువ శాతం ఉన్నారు అని, చిన్న వయస్సు నుండే మొబైల్ ఫోన్స్ ఉపయోగించటం వలన పిల్లల్లో మానసిక సమస్యలు తలెత్తుతున్నాయి అని, శారీరకంగా మరియు మానసికంగానూ ప్రభావం చూపిస్తుంది వాటికీ చికిత్స మరియు సహాయం రెండు అవసరం అవుతుంది అని అన్నారు

అనంతరం నవజీవన్ జోనల్ కోఆర్డినేటర్ %వీ% కవిత మాట్లాడుతూ ఈ మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన బాలలను , యువత ను డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకొనిరావచ్చు అని ఈ లాంటి సమస్యల తో ఉన్నవిద్యార్థులకు , యువతకు నూజివీడు మండలం పొలసానపల్లి లో ఏర్పాటు చేసిన “ బోస్కో డీ అడిక్షన్ కేంద్రాన్ని” ఉచితంగా సంప్రదించ వచ్చు అని సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 9490492020 అని తెలిపారు అనంతరం పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి కీర్తి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు మెదడుపై తీవ్ర ప్రభావం వల్ల శారీరకంగానూ, మానసికంగానూ ప్రభావం చూపిస్తుంది అని సోషల్ మీడియా , మాదకద్రవ్య వ్యసనాన్ని అధిగమించడానికి డాక్టర్లు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహాయక బృందాలు లేదా వ్యవస్థీకృత చికిత్స సహాయం అవసరం అవుతుంది అని, మత్తు పదార్థాలు మరియు సోషల్ మీడియా దుర్వినియోగం పై ఆశా , ఆరోగ్యకార్యకర్తలకు నవజీవన్ బాల భవన్ వారు అవగాహనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినయించదగ్గ విషయం అని, వారి సేవలను ఉపయోగించుకోవాలని ,కమ్యూనిటీ లో అలాంటి వారిని గుర్తించినట్లు అయితే నవాజీవన్ వారికి తెలియచేయాలి అని కోరారు

ఈ కార్యక్రమములో నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్స్ బి రమేష్, గుంటూరు జిల్లా ఈగల్ టీం పోలీస్ పి కృష్ణా, పి రోశయ్య పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సీతామహాలక్ష్మి , ఆశా , ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు,

# ఉద్యోగుల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలోకి



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితి దారుణంగా మారిందని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి తీవ్రంగా విమర్శించారు. పెనం మీద నుంచి పొయ్యిలోకి పడినట్లుగా ఉద్యోగులు కష్టాలు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చి ఇప్పుడు ఒక్కటీ అమలు చేయలేదని అన్నారు. హామీలు పక్కనబెడితే కనీసం ఉద్యోగులను పట్టించుకునే పరిస్థితి కూడా లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఉద్యోగ సంఘాల నాయకులకు అపాయింట్మెంట్ ఇవ్వడం లేదని, ఆయన సహకారంతో ఎన్నికల సమయంలో రాష్ట్రం అంతా తిరిగిన నాయకులను కూడా కలవడంలేదని వ్యాఖ్యానించారు.

ఉద్యోగులు ఇప్పుడు దిక్కులేనివారిగా మారారని, సమస్యలు చెప్పుకునే పరిస్థితి లేకపోయిందని ఆయన అన్నారు. గతంలో మంత్రుల కమిటీ, ప్రభుత్వ సలహాదారులు అందుబాటులో ఉండేవారని, కానీ ఇప్పుడు ఉద్యోగులను ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శించారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులు రోడ్డు మీదకు రావడానికి మూడేళ్లు పట్టిందని, అయితే ప్రస్తుత ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే వారిని నిరసనలకు దిగేలా చేసిందని వ్యాఖ్యానించారు.

డాక్టర్లు, గ్రామ-వార్డు సచివాలయ సిబ్బంది, విద్యుత్ ఉద్యోగులు, టీచర్లు అందరూ ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆయన ఆక్షేపించారు. 16 నెలలుగా ఒక్క డిఎ. ఇవ్వని ప్రభుత్వం ఇదే అని, 4 డి.ఎ లు పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. “ఈ పండుగ నెలలో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఇప్పటికీ జీతాలు చెల్లించలేదు. పెండింగ్ బకాయిలు ఎంత అనేది కూడా ప్రభుత్వం వెల్లడించడం లేదు. ఆర్థికశాఖ ఆర్టీఐ కింద సమాచారం లేదని సమాధానం ఇచ్చిన స్థాయికి దారితీసింది,” అని కాకర్ల వెంకట్రామిరెడ్డి అన్నారు. గత ప్రభుత్వం 5 ఏళ్లలో ?22 వేల కోట్ల పెండింగ్ బకాయిలు ఉంచితే, ప్రస్తుత ప్రభుత్వం కేవలం 16 నెలల్లోనే ?10 వేల కోట్లు పెంచిందని ఆయన పేర్కొన్నారు.

గత ప్రభుత్వంలో అసెంబ్లీలో చట్టం చేసి 10,117 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని నిర్ణయించగా, 3,400 మందికి మాత్రమే అవకాశం కల్పించారని, మిగిలిన వారిని రెగ్యులర్ చేయడంలో ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్యం అర్థం కావడం లేదని విమర్శించారు. గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులను వాలంటీర్ల స్థాయికి దిగజార్చారని, లక్షా ముప్పై వేల మంది సచివాలయ ఉద్యోగులు రెండు వారాలుగా ధర్నాలు చేస్తున్నా వారిని పిలిచి మాట్లాడే ధైర్యం ప్రభుత్వానికి లేదని ఆయన మండిపడ్డారు.

“ఉద్యోగులపై టెలీకాన్ఫరెన్సులు, వీడియో కాన్ఫరెన్సుల వత్తిడి పెరిగింది. ముఖ్యంగా ఎంపీడీఓల పరిస్థితి దారుణంగా ఉంది. వారి మీద పది మంది పెత్తనం చేస్తుంటే వారికి పని చేసే సమయం ఎక్కడుంది? ఇవన్నీ చాలవన్నట్లు వారితో చెత్త ఫోటోలు తీయిస్తున్నారు. ఇది ఉద్యోగుల అవమానానికి తారకమైంది,” అని ఆయన అన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు చేశామని, ఇప్పుడు ఉద్యోగులందరూ ఏకమై పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. త్వరలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసి తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

## రూ.11 కోట్ల ఎర్రచందనం పట్టివేత

# ఇద్దరు స్మగ్లర్లు అరెస్టు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీ, దిల్లీ పోలీసుల సంయుక్త ఆపరేషన్?లో భారీగా ఎర్రచందనం నిల్వలను పట్టుకున్నామని స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. దిల్లీలో తుగ్లకాబాద్లోని గోదాములపై నిర్వహించిన దాడుల్లో సుమారు 10 టన్నుల దుంగలను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.


పట్టుకున్న ఏ గ్రేడ్ చందనం విలువ సుమారు రూ. 11 కోట్ల విలువ ఉంటుందని ఈ సందర్భంగా పోలీసు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్, ముంబైకి చెందిన ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేశామనీ, హరియాణాకు చెందిన మరో నిందితుడు పరారీలో ఉన్నాడని వివరించారు. ఎర్రచందనం తిరుపతి నుంచి దిల్లీకి అక్రమంగా తరలించినట్టు గుర్తించామని అధికారులు పేర్కొన్నారు.

10 టన్నుల ఎర్రచందనం పట్టివేత: ఏపీ, దిల్లీ పోలీసుల సంయుక్త ఆపరేషన్లో స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందం భారీగా ఎర్రచందనం నిల్వలను స్వాధీనం చేసుకుంది. ఏపీ నుంచి దిల్లీకి తరలించిన సుమారు 10 టన్నుల ఎర్రచందనాన్ని సంబంధిత సమాచారంతో పట్టుకున్నారు.

ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు: దిల్లీలోని తుగ్లకాబాద్లో ఎర్రచందనం బయటపడింది. అంతేకాకుండా దిల్లీ, ఏపీ పోలీసులు హైదరాబాద్, ముంబయికి చెందిన ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. పోలీసుల అదుపులో ఎర్రచందనం స్మగ్లర్లు ఇర్ఫాన్, అమిత్పవార్ ఉన్నారు. అయితే హరియాణాకు చెందిన మరో ఎర్రచందనం స్మగ్లర్ పరారీలో ఉన్నాడు. ఎర్రచందనం దుంగలను తిరుపతి నుంచి దిల్లీకి తరలించినట్లు సమాచారం. జులైలో అందిన సమాచారం ఆధారంగా ఏపీ పోలీసులు ఆపరేషన్ చేపట్టారు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతుందని ఎస్టీఎఫ్ పోలీసులు అధికారికంగా తెలియజేశారు.

# ట్రంప్ ఇమిగ్రేషన్ పాలసీ వల్ల భారీగా తగ్గిన భారత విద్యార్థి వీసాలు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** మాస్ డిపోర్టేషన్, అరెస్టులు, చట్టపరమైన ప్రవేశాలపై ఆంక్షలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి వలసదారులపై విరుచుకుపడుతున్నారు . అమెరికా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. దీంతో బంగారు భవిష్యత్తును తలుచుకుంటూ ఆ దేశానికి వెళ్లాలనుకునే వారి సంఖ్య తగ్గిపోతోంది. ఆగస్టులో ఉన్నతవిద్య కోసం అమెరికాకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య భారీగా పడిపోయిందని ఇంటర్నేషనల్ ట్రేడ్ కమిషన్ వెల్లడించింది.



ట్రంప్ చర్యల నేపథ్యంలో ఆగస్టులో విదేశీ విద్యార్థులకు జారీచేసే వీసాల్లో తగ్గుదల కనిపించింది. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే అమెరికాకు వచ్చే విద్యార్థుల సంఖ్య 19శాతం తగ్గింది. కరోనా మహమ్మారి తర్వాత ఇదే రికార్డు స్థాయి తగ్గుదల కావడం గమనార్హం. ఇక భారతీయ విద్యార్థుల విషయానికొస్తే 44 శాతం మేర క్షీణత కనిపించింది సాధారణంగా యూఎస్ విశ్వవిద్యాలయాలు ప్రారంభమయ్యే ఆగస్టులో అమెరికా 3,13,138 విద్యార్థి వీసాలు జారీ చేసింది. గత ఏడాది ఇదే సమయానికి అగ్ర దేశానికి వెళ్లిన విద్యార్థుల సంఖ్యలో భారత్ ముందంజలో ఉండగా, ఈసారి ఆ సంఖ్య భారీగా తగ్గింది. మరోవైపు.. చైనా విద్యార్థులకు యూఎస్ 86,647 వీసాలు జారీ చేసింది. భారతీయులకు జారీ చేసిన వీసాల సంఖ్య కంటే ఇది రెట్టింపు కావడం గమనార్హం.

ఏడాది మేలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా రాయబార కార్యాలయాల్లో కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థుల వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగును తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. సోషల్ మీడియా వెట్టింగ్ కోసం వీసాల జారీని నిలిపివేశామని అప్పట్లో ఆ దేశ విదేశాంగ శాఖ వెల్లడించింది. వీసా దరఖాస్తుదారులకు అనుమతి ఇవ్వొచ్చా.. లేదా అనే దాన్ని అంచనా వేయడం కోసం వారి ఆన్లైన్ యాక్టివిటీని అధికారులు తనిఖీ చేయనున్నారు. దీన్నే 'సోషల్ మీడియా వెట్టింగ్' అంటారు. సంబంధిత విద్యార్థుల సోషల్ మీడియా ప్రొఫైళ్లను పరిశీలించిన తర్వాతే వీసా మంజూరు చేస్తారు. అయితే తర్వాత వీసా ఇంటర్వ్యూలను షెడ్యూల్ చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు ట్రంప్ హెచ్-1బీ వీసా దరఖాస్తు రుసుమును భారీగా పెంచిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలన్నీ అమెరికా వెళ్లే భారతీయ విద్యార్థులపై ప్రభావం చూపిస్తున్నాయి.







# స్వచ్ఛతకు పురస్కారాల పట్టం

- సీఎం చేతుల మీదుగా అవార్డులు అందుకున్న జిల్లా విజేతలు

**విజయవాడ, అక్టోబరు 7 (జర్నలిస్ట్ ఫైల్)**

పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణలో ఉత్తమ ప్రతిభకు పట్టం కడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛాంధ్ర పురస్కా రాలు–2025లో ఎన్టీఆర్ జిల్లాకు ఎనిమిది రాష్ట్రస్థాయి అవార్డులు లభించగా.. సోమ వారం నగరంలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగిన కార్యక్ర మం లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయు డు స్వచ్ఛాంధ్ర పురస్కారాలను విజేతలకు అందజ ేశారు. మొత్తం 69 రాష్ట్రస్థాయి పురస్కారాల్లో ఎనిమిది పురస్కారాలు ఎన్టీఆర్ జిల్లాకు లభించాయి. ప్రత్యేక కేటగిరీ అవార్డులు (స్వచ్ఛ్ సర్వేక్షణ్)లో విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్, స్వచ్ఛ కాలనీల విభాగంలో విజయవాడలోని కేపీ నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్, స్వచ్ఛ ఆసుపత్రుల విభాగంలో విజయవాడ హెచ్‌బీ కాలనీ యూపీహెచ్‌సీ, పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు ప్రభుత్వ ఆయుర్వే ద వైద్యశాల, స్వచ్ఛ అంగన్వా డీలు విభా గంలో కేదారేశ్వరపేట – 3 అంగన్వాడీ కేంద్రం,



స్వచ్ఛ బస్ స్టేషన్ల విభాగంలో విజయవాడ బస్ స్టేషన్, స్వచ్ఛ పాఠశాలల కేటగిరీలో విజయవాడ కృష్ణల ంకలోని వీఎంఆర్ఆర్ (జి) మునిసిపల్ కార్పొ రేషన్ హైస్కూల్, స్వచ్ఛతా ఎన్‌జీవోలు కేటగిరీలో రైజ్ సంస్థ అవార్డులు సాధించగా ఆయా సంస్థలు, పాలనా యూనిట్ల ప్రతినిధులు గౌరవ ముఖ్యమంత్రి చేతులుమీదుగా అవార్డుల తో పాటు అభినందనలు అందుకున్నారు.

### టీమ్ ఎన్టీఆర్ విజేతలకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అభినందనలు..

స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనకు ముందడుగు వేస్తూ స్వచ్ఛాంధ్ర పురస్కారాల్లో ఎన్టీఆర్ జిల్లాను ముందు వరుసలో నిలిపి నందుకు అధికారులు, సిబ్బందికి కలెక్టర్ లక్ష్మీశ అభినందనలు తెలిపారు. ఈ పురస్కా రాలు స్ఫూర్తిగా జిల్లాను మరింత స్వచ్ఛత దిశగా నడిపించాలని ఆయన పేర్కొన్నారు. పారిశుద్ధ్యం, పరిశుభ్రతలో చేసిన విశేష కృషిని గుర్తించేందుకు, స్వచ్ఛాంధ్ర మిషన్‌లో భాగస్వామ్య పక్షాలను కీలకపాత్ర పోషించేలా ప్రోత్సహించేందుకు, సంస్థలు, పాలనా యూ నిట్ల మధ్య ఆరోగ్యకర పోటీని ప్రోత్స హించేందుకు, పారిశుద్ధ్యం, పరిశుభ్రతలో అత్యుత్తమ విధా నాలు, ఆవిష్కరణల ప్రదర్శ నకు, స్వచ్ఛాంధ్రలో ప్రజా భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు ఈ పురస్కారాలు దోహదం చేస్తాయన్నారు.



విజయవాడ నగరపాలక సంస్థకు లభించిన ప్రత్యేక కేటగిరీ పురస్కారాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకుంటున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, విజయవాడ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం



## స్వచ్ఛాంధ్ర పురస్కారాల్లో మెప్మాకు అరుదైన గౌరవం

- మెప్మాకు నాలుగు పురస్కారాలు ప్రదానం చేసిన సీఎం చంద్రబాబు

**విజయవాడ, అక్టోబరు 7 (జర్నలిస్ట్ ఫైల్)**

సామాజిక అభివృద్ధిలో తమదైన ముద్ర వేస్తూ, పట్టణ పేదల సాధికారత కోసం కృషి చేస్తున్న మెప్మా సంస్థ, ప్రతిష్టాత్మకమైన స్వచ్ఛాంధ్ర పురస్కారాల్లో సరికొత్త రికార్డు సృష్టించింది. ఒకే వేదికపై ఏకంగా నాలుగు రాష్ట్ర స్థాయి అవార్డులను కైవసం చేసుకుని, ఆ సంస్థ నిబద్ధత, ఆధునికత కోసం చేసే కృషిని మరోసారి చాటి చెప్పింది. ఈ రోజు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ పురస్కారాలను ప్రదానం చేశారు.

### సాంకేతికతకు దక్కిన గౌరవం: బెస్ట్ సోషల్ మీడియా మేనేజ్‌మెంట్

మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ కార్యక్రమాలను, పేదలకు అందుబాటులో ఉన్న అవకాశాలను వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మెప్మా ప్రదర్శించిన చురుకుదనం ప్రశంసలు అందుకుంది. మెప్మాకు 'బెస్ట్ సోషల్ మీడి యా మేనేజ్‌మెంట్' అవార్డు లభించడం, డిజిటల్ యుగంలో ప్రభుత్వ సంస్థలు ప్రజలతో ఎలా అనుసంధానం కావాలనేదానికి ఒక ఆదర్శంగా నిలిచింది. మెప్మా మిషన్ డైరెక్టర్, ఎన్. తేజ్ భారత్, ముఖ్యమంత్రి నుండి ఈ అత్యుత్తమ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ విజయం, క్షేత్రస్థాయి సిబ్బంది, సామాజిక కార్యకర్తల అంకితభావానికి, సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిం చుకున్నందుకు నిదర్శనం.

### క్షేత్రస్థాయి కృషికి కిరీటం

3 స్వచ్ఛ ఎస్ఎల్ ఎఫ్ అవార్డులు పట్టణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, జీవనోపాధి కల్పనలో కీలకపాత్ర పోషిస్తున్న మహిళా సంఘాల (స్లమ్ లెవెల్ ఫెడరేషన్ – ఎస్ఎల్ ఎఫ్) ప్రకాశం, విశాఖ, శ్రీకాకుళం జిల్లాల సమర్థ నిర్వహణకు గాను మరో మూడు ముఖ్యమైన అవార్డులను మెప్మా దక్కించుకుంది.

## పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి చేయాలనేది లక్ష్యం





- 2027లో ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం
- పోలవరం పనుల ప్రగతిపై కేంద్రం సంతృప్తి
- ఢిల్లీలో సమీక్ష సమావేశం అనంతరం మంత్రి రామానాయుడు వివరాలు వెల్లడి

**ఢిల్లీ, అక్టోబరు 7 (జర్నలిస్ట్ ఫైల్)**

పడకేసిన 'పోలవరం' పనుల ను పట్టాలెక్కించి, పరుగులు తీయిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వ పనితీరు పట్ల కేంద్రం పూర్తి సంతృప్తిని వ్యక్తం చేసినట్లు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఢిల్లీలో సోమవారం కేంద్ర జల శక్తి మంత్రి పాటిల్ ఆధ్వర్యంలో జరిగిన పోలవరం పనుల సమీక్షా సమావేశం వివరాలను మంత్రి మీడియాకు వివరించారు. 2019–24 మధ్య జగన్ ఐదేళ్ల పాలనలో పోలవరానికి జరిగిన నష్టాన్ని, విధ్వంసాన్ని, 2024 లో కూటమి ప్రభుత్వ అధికారం లోకి వచ్చిన తర్వాత పరిస్థితులను చక్కదిద్ది.. పనులను పరుగులు పెట్టిస్తున్న నేటి స్థితి వరకు సమీక్షలో చర్చించామన్నారు. కాలావధి లక్ష్యాన్ని నిర్ణయించుకుని 2027 డిసెంబర్ కల్లా.. వీలైతే పుష్కరాలకు ముందు అంటే అదే ఏడాది జూన్ లోనే పోలవరం పూర్తి చేసి ప్రధాని మోడీ చేతుల మీదుగా జాతికి అంకితం చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని పాటిల్ స్వాగతించారు. సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ కి జీవనాడి, జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం నిర్దేశిత గడువులో పూర్తి చేయడానికి తమ వంతు పూర్తి సహకారం అందిసామని కేంద్ర జల శక్తి మంత్రి పాటిల్ హామీ ఇచ్చినట్లు రామానాయుడు స్పష్టం చేశారు. ఇందుకు ఆయనకు, గౌరవ ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ ఎన్డీఏ డబుల్ ఇంజన్ సర్కార్ ఉండటం వల్ల పోలవరం పూర్తి కావడం, పోలవరం నీటితో రాష్ట్రం సస్యశ్యామలం కావడం ఖాయమన్నారు. 2019లో తెలుగుదేశం ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 లోనే పోలవరం పూర్తయ్యేదని మంత్రి రామానాయుడు చెప్పారు. 72% పూర్తయిన పోలవరం ప్రాజెక్టు ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల, రివర్స్ పాలన తో నీరుగార్చడం వల్ల ప్రాజెక్టుకు అపార నష్టం జరిగిందని మంత్రి ఆవేదన చెందారు. ప్రాజెక్ట్ కు జరిగిన నష్టం తో పాటు ఐదేళ్లలో రాష్ట్రంలోని అన్నదాతలకు రావలసిన 50 వేల కోట్ల ఆదాయం నష్టపోయినట్లు మంత్రి అంచనా వేశారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే 23.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు స్థిరీకరణ జరుగుతుందన్నారు. 28.5 లక్షలు మందికి తాగునీరు అందుతుందన్నారు. 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. పోలవరంతో రాష్ట్రం దశ దిశ మారిపోవడం ఖాయమన్నారు. ఈ ఆశయంతోనే గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయం పర్యవేక్షణలో ప్రతి 15 రోజులకు సమీక్ష చేస్తూ పనులను పరుగులు పెట్టిస్తున్నారని చెప్పారు. అందులో భాగంగా అత్యంత కీలకమైన డయాఫ్రమ్ వాల్ 1398 మీటర్లకు గాను ఇప్పటికి 686 మీటర్లు అంటే 56% పూర్తయినట్లు చెప్పారు. ప్రస్తుత వర్షాకాలంలో రోజుకి 5 లక్షలు పైగా క్యూసెక్కులు వరద నీరు ప్రవహిస్తున్నా పనులు ఆపలేదన్నారు. అదే జగన్ ఐదేళ్ల హయాంలో ఎగువ, దిగువ కాపర్ డ్యాముల మధ్య వరద నీరు రిజర్వాయర్ ను తలపించే దన్నారు. ఇలా జరగకుండా బట్రస్ డ్యామ్ నిర్మించి సీపేజీని అరికట్టామన్నారు. పోలవరం ప్రాజెక్టుకి నాటి జగన్ ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని, దశల వారి జరిగిన విధ్వంసాన్ని మంత్రి కళ్ళకు కట్టినట్లు వివరించారు. వారి బాధ్యతా రాహిత్యాన్ని ఎండగట్టారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం 2014–19 మధ్యకాలంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఖర్చు పెట్టిన 3750 కోట్లు, జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రియంబర్స్మెంట్ గా వస్తే ఆ నిధులను దారి మళ్లించేసినట్లు రామానాయుడు వివరించారు.

### ప్రాజెక్టుకి నిధుల సమస్య లేదు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలవరం ప్రాజెక్టుకి రూ.12157 కోట్లు కేంద్రం మంజూరు చేయగా ఇప్పటికే 5052 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. చేసిన పనులు తాలూకు వివరాలు ఎప్పటికప్పుడు కేంద్రానికి సమర్పిస్తే, దశల వారీగా నిధులు కేంద్రం మంజూరు చేస్తుందని.. అందువల్ల నిధుల సమస్య లేనే లేదని మంత్రి స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్ట్ ఫేజ్ –1కి సంబంధించి (అంటే 41.15 మీటర్ల ఎత్తుకు నీటిని నిలబెట్టే వరకు ) నిర్వాసి తులు ఎవరైతే ఉన్నారో వారందరికీ నష్టపరిహారం, కాలనీల నిర్మాణం, వసతులు సమకూర్చడం వంటి అన్ని పనులు 2026 మే నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకన్నట్లు మంత్రి చెప్పారు. మొదటి ఫేజ్ లో 20946 మంది నిర్వాసితులు ఉన్నట్లు చెప్పారు. వీరం దరికీ 75 కాలనీలు నిర్మించాల్సి ఉండగా ఇప్పటికి 26 పూర్తయినట్లు చెప్పారు. మిగిలిన 49 ప్రోగ్రెస్ లో ఉన్నాయన్నారు. బ్యాలెన్స్ పనులకు, ఇతర సదుపా యాలు సమకూర్చడానికి రూ. 900 కోట్లు కేటాయించి టెండర్లు పిలిచామన్నారు. ఫేజ్– 2 కి సంబంధించి నిర్వాసితులకు 2027 మార్చి కల్లా కాలనీలు నిర్మించి, సదుపాయాలు సమకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రామానాయుడు చెప్పారు. పోలవరం ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేమని చేతులెత్తేసిన నాటి ముఖ్య మంత్రి జగన్ కి, గడువు చెప్పి.. ప్రారంభానికి పనులు పరుగులు పెట్టిసున్న నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దక్షతకు తేడా గమనించాలని రామానా యుడు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మొదటి ఫేజ్ లో 41.15 మీటర్లు కాంటూరుకి సంబంధించి 38వేల 060 కుటుంబాలను గుర్తించామన్నారు. ఇందులో మొ దటి విడతలో 20,946, తరువాత రాడార్ సర్వే ద్వారా మరో 17,174 కుటుంబాలకు 75 కాలనీలు అవసరమైతే, నాడు చంద్రబాబు గారి హయాంలోనే 26 కాలనీ లు పూర్తి చేశాం. 49 కాలనీలో పురోగతిలో ఉన్నాయని వివరించారు2019–24 జగన్ పరిపాలనా కాలంలో ఒక్కకాలనీలో ఒక్క నిర్వాసితుడి ఇంటికి, అరబస్తా సిమెంట్ గానీ, మౌళిక వసతుల కోసం ఒక్క రూపాయి గానీ ఖర్చు పెట్టలేదని విమర్శించారు. నాడు చంద్రబాబు ప్రభుత్వంలో నిర్మించిన కాలనీలు తప్ప, ఒక్క నిర్వాసితుడి ఇంటిని కూడా పూర్తి చేయలేదని అన్నారు.

## డాక్టర్ అనూషకు సత్కారం



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి గణపతి నగర్లోని ఇందిరా నగర్ యూపీహెచ్సీలో ప్రభుత్వం వివిధ కేటగిరీలలో అందజేసిన స్వచ్ఛ ఆంధ్ర-2025 అవార్డులలో ఇందిరా నగర్ యూపీహెచ్సీ తరుపున జిల్లాస్థాయిలో ఉత్తమ స్వచ్ఛ హాస్పిటల్ గా జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ తమీమ్ అన్సారియా చేతుల మీదగా అవార్డు అందుకున్న డాక్టర్ పీ అనూష ను మంగళవారం నియోజకవర్గ టీడీపీ అంగన్వాడి కార్యనిర్వాహణ కార్యదర్శి గోవాడ వెంకట లక్ష్మి, నాయకులు సత్కరించారు. డాక్టర్ అనూష ను వారు శాలువాతో సత్కరించి బొకే అందజేశారు. అనంతరం వెంకట లక్ష్మి మాట్లాడారు. హెల్త్ సెంటర్ ను పరిశుభ్రతలో కార్పొరేట్ హాస్పిటల్ కు దీటుగా ఉంచడంతోపాటు, రోగులకు విశిష్టమైన సేవలు అందిస్తున్న డాక్టర్ అనూష కలెక్టర్ చే అవార్డు అందుకోవటం సంతోషంగా ఉందన్నారు. హెల్త్ సెంటర్లో గర్భిణీ మహిళలకు పలు స్వచ్ఛంద సేవా సంస్థలచే పండ్లు, పౌష్టికాహారాలు, ప్రోటీన్ పౌడర్ వంటివి అందజేయడం, అంగన్వాడీల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను హెల్త్ సెంటర్ కు వచ్చిన రోగులకు అవగాహన కల్పించి సేవలందిస్తున్నారన్నారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని అవార్డులు అందుకోవాలని వెంకట లక్ష్మి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ మాజీ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, టీడీపీ సీనియర్ నాయకులు గోవాడ రవి తదితరులు పాల్గొన్నారు.

## వీధి కుక్కలపై ఫిర్యాదులకు ప్రత్యేక సెల్ ఏర్పాటు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** వీధి కుక్కలకు సంబందించిన ఫిర్యాదులు స్వీకరించి వాటిని పరిష్కరించుటకు ప్రత్యేకంగా సెల్ ను ఏర్పాటు చేశామని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్. అలీం భాషా తెలిపారు. ప్రజలు వీధి కుక్కల సమస్యను 7093912653, 08645-295192 ఫోన్ నంబర్లకు సమాచారం అందించవచ్చని చెప్పారు. "మహిళపై శునకాల దాడి" శీర్షికన ఒక దిన పత్రికలో సోమవారం ప్రచురితమైన వార్తపై కమిషనర్ స్పందిస్తూ మంగళగిరి పట్టణ పరిధిలో కొత్తపేట 2వ వార్డులో నివశించే కంటే వెంకట నాగలక్ష్మి అనే మహిళ ఆఫీసుకు వెళుతుండగా శునకాలు వెంటాడి దాడి చేశాయని, చిన్నపిల్లలు ఆడుకోవాలన్నా భయపడే పరిస్థితి ఎదురవుతుందని, పగలు, రాత్రి తేడా లేకుండా శునకాలు ప్రజలపై దాడి చేస్తున్నాయని వాటి బెడద నుంచి రక్షణ కల్పించాలని వార్తా కథనం రాగా వెంటనే కొత్తపేటలో వీధి కుక్కలను పట్టుకొని ఏ.బి.సి, ఎ.ఆర్.వి వ్యాక్సినేషన్ నిర్వహించడం జరిగిందన్నారు. కాజ వ్యాక్సినేషన్ సెంటరులో సురక్షితంగా ఉంచడం జరిగిందని చెప్పారు. నగర పాలక సంస్థ పరిధిలో మొత్తము 5,908 వీధి కుక్కకు వ్యాక్సినేషన్ నిర్వహించామని, ఇంకా 258 వీధి కుక్కలకు నవంబరు 30 2025 నాటికి వ్యాక్సినేషన్ పూర్తికి చర్యలు చేపట్టామని తెలిపారు. వీధి కుక్కలు బెడద ఎక్కువగా వున్న ప్రాంతాలలో గల వీది కుక్కలకు ఏ.బి.సి, ఎ.ఆర్.వి వ్యాక్సినేషన్ నిర్వహించుట జరుగుతుందని అన్నారు.

## చెత్త నుంచి సంపద సృష్టించవచ్చు




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్):** చేబ్రోలు గ్రామపంచాయతీలలో ఘన వ్యర్థాల నిర్వహణ , పరిశుభ్రత పచ్చదనం పై పంచాయతీ కార్యదర్శులకు ఒకరోజు మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ కార్యక్రమంను మంగళవారం చేబ్రోలులో నిర్వహించారు . చెత్త నుండి సంపద తయారీ కేంద్రంమైన చేబ్రోలు స్థానిక శిక్షణ కేంద్రం లో ఈ ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిం చారు . జిల్లా స్థాయిలో ఏర్పాటుచేసిన ఈ శిక్షణలో 16 మండలాలకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శులకు మాస్టర్ ట్రైనర్స్ గా ఈ శిక్షణ ఇవ్వడం జరిగిందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి ఊహారాణి తెలిపారు . శిక్షణ పొందిన పంచాయతీ కార్యదర్శులు వారి స్థానిక మండలాల్లో పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు . కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా పంచాయతీ అధికారి వి వి ఎన్ సాయికుమార్ పాల్గొని శిక్షణ ఉద్దేశించి మాట్లాడారు. ఈ శిక్షణలో మండలానికి ఒక పంచాయతీ కార్యదర్శి చొప్పున గుంటూరు జిల్లాలోని 16 మండలాల నుంచి ఎంపిక చేయబడిన శిక్షకులు( ట్రైనర్స్) పాల్గొన్నారు . గ్రామాలలో క్షేత్రస్థాయిలో ఇంటింటి ఘన వ్యర్థాల సేకరణ మరియు వేరు చేయుట , సంపద సృష్టి లో పారిశుధ్య కార్మికులను వినియోగము అలానే వారి హక్కులు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హత అవకాశాలు గురించి వివరించారు . శిక్షణ వనరుల వ్యక్తులుగా జిల్లా పంచాయతీ వనరుల కేంద్ర రిసోర్స్ పర్సన్ కె అనురాధ ,జిల్లా శిక్షణ మేనేజర్ కె నాగేశ్వరరావు వ్యవహరించారు . కార్యక్రమంలో ఈ టి సి బాపట్ల ఫ్యాకల్టీ కె లలిత , డిప్యూటీ ఎంపీడీవో ఎం రవిశంకర్ , ఎం సి ఓ ఎస్ బి ఎం జి ప్రసాద్ , (మాస్టర్ ట్రైనర్స్ ) పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# రేషన్ పంపిణీలో అక్రమాలకు తావులేదు

○ **గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి హెచ్చరిక**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో రేషన్ పంపిణీ వ్యవస్థ పై ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి మంగళవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్ సరఫరా, లబ్ధిదారుల వివరాలు, డీలర్ల పనితీరు, నియమ నిబంధనల అమలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజక వర్గంలో మొత్తం 95 రేషన్ షాపులు ఉన్నాయి. ప్రతి షాపు తన పరిధిలో ఉన్న లబ్ధిదారులందరికీ సమయానికి సరుకులు అందించాలి. ఏ ఒక్కరికి అన్యాయం జరగకూడదు. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి వారి హక్కుగా ప్రభుత్వ సరుకులు తప్పక అందాలి, ఇది అధికారుల బాధ్యత, డీలర్ల కర్తవ్యం" అని స్పష్టం చేశారు. ఎవరైనా రేషన్ పంపిణీ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు. నాకు ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదు వచ్చినా, నేను నేరుగా అధికారులను ప్రశ్నిస్తానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హెచ్చరించారు. కొందరు రేషన్ షాపులను వ్యాపార సంస్థల్లా నడుపుతున్నారు. ఇలాంటి ప్రవర్తన అస్సలు సహించం. డీలర్లు సిండికేట్‌లా వ్యవహరించడం కుదరదు. ప్రతి డీలర్ తన పరిధిలో ఉన్న ప్రజలకే సేవ చేయాలి. అవకతవకలకు తావు లేకుండా ఉండాలని స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసం ప్రభుత్వం పై నిలబెట్టడం మనందరి బాధ్యత. ఇక నుంచి గుంటూరు పశ్చిమలో రేషన్ పంపిణీ సమస్యలు రాకుండా కఠిన పర్యవేక్షణ ఉండాలి. నవంబర్ నెల నుండి ఒక్క ఫిర్యాదు కూడా రాకూడదని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశించారు.

**రోడ్డుకు అడ్డముగా ఉన్న విద్యుత్తు స్తంభాలను పక్కకు తొలగించాలి**

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ఉన్న వివిధ డివిజన్ లలో రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్తు స్తంభాలను పక్కకు జరపి ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించి డివిజన్ లలో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్తు స్తంభాల చిత్రాలను అధికారులకి చూపించి వెంటనే వాటిని పక్కకు జరిపి ఏర్పాటు చేయాలని, దీని వలన ప్రజలు, వాహన చోదకులు రాత్రి పూట ప్రమాదాలకు గురవుతున్నారని వెంటనే ఈ పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశించారు.

**చాకలికుంటను పరిరక్షిస్తా**

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ 36వ డివిజన్ లో ఉన్న చాకలికుంట ఆక్రమణలకు గురయ్యిందని, వెంటనే సర్వే జరిపి ఈ కుంటను పరిరక్షించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి టౌన్ ప్లానింగ్ అధికారి నారాయణ స్వామి నీ ఆదేశించారు. అదే విధంగా కొండయ్య కాలనీలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశించారు.

## 10న జరిగే క్యాబినెట్ సమావేశంలో ఉద్యోగుల డిఏ పై చర్చ..!

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** ఏపీలో గత వైసీపీ ప్రభుత్వహయాంలో ఇబ్బందులు ఎదుర్కొన్న ఉద్యోగులకు కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే పరిస్థితి ఎదురవుతోంది. ఇదే విషయాన్ని ఇప్పటికే ఉద్యోగ సంఘాల నేతలు పలుమార్లు బహిరంగంగానే చెప్పేస్తున్నారు. ఈ మేరకు తమపై ఉద్యోగుల నుంచి తీవ్ర ఒత్తిడి ఉందని కూడా ప్రకటించారు. అలాగే దసరా సందర్భంగా కనీసం డీఏ బకాయిలు అయినా ప్రకటించాలని కూడా ప్రభుత్వం స్పందించలేదు. ఈ నేపథ్యంలో ఉద్యోగులు ఈ నెలలో ఆందోళనలకు తెరలేపేందుకు సిద్ధమవుతున్నారన్న వార్తలొస్తున్నాయి. దీంతో ప్రభుత్వం అలర్ట్ అయినట్లు తెలుస్తోంది. ఈ నెల 10న జరిగే కేబినెట్ భేటీలో ఉద్యోగుల డీఏ బకాయిలపై చర్చించి ఓ కీలక నిర్ణయం తీసుకుంటారని చెప్తున్నారు. ఈ మేరకు కేబినెట్ భేటీ అజెండాలో ఉద్యోగుల డీఏ అంశాన్ని కూడా చేరుస్తున్నట్లు సమాచారం.

రాష్ట్రంలోని ఉద్యోగుల్లో పెరుగుతున్న అసంతృప్తి నేపథ్యంలో డీఏతో పాటు పీఆర్సీ నియామకం సహా ఇతర అంశాలపైనా కేబినెట్లో చర్చిస్తారని తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 16 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఒక్క డీఏ కూడా విడుదల కాకపోవడంపై ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. అలాగే అంతకు ముందు 4 డీఏలు కూడా బకాయి ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు కొత్త పీఆర్సీని ప్రకటించకపోవడం, కనీసం పీఆర్సీ కమిషనర్ ను అయినా నియమించక పోవడం, పీఆర్సీ బకాయిల చెల్లింపు.. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా సమస్యలే ఉన్నాయి. వీటిపై ప్రభుత్వం దృష్టిసారించడం లేదనే అసంతృప్తి వారిలో నెలకొంది.

ఈ నేపథ్యంలో 10న జరిగే కేబినెట్ భేటీలో ఉద్యోగుల్లో భారీ అంచనాలే ఉన్నాయి.

కనీసం పెండింగ్ డీఏల్లో ఎన్నో కొన్ని అయినా ప్రకటిస్తారని వారు భావిస్తున్నారు. దీంతో పాటు పీఆర్సీ కమిషనర్ నియామకం, ఐఆర్ ప్రకటన వంటి అంశాలపైనా కేబినెట్ దృష్టిసారిస్తుందని ఉద్యోగులు చెప్తున్నారు. అదే జరిగితే ఉద్యోగుల్లో అసంతృప్తి కాస్తయినా చల్లారే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై బ్రెజిల్ దేశపు ప్రతినిధులకు అవగాహన



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** తెనాలి నియోజకవర్గం కొలిపర మండలంలో ప్రకృతి వ్యవసాయానికి రైతులు ఇస్తున్న ప్రాధాన్యత క్రమంలో, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకునేందుకు, బ్రెజిల్ దేశం నుండి,25 మంది సభ్యుల బృందం కొల్లిపర మండలం అత్తోట గ్రామానికి చేరుకుంది. అత్తోట గ్రామంలో యెర్రు బాపయ్య అనే రైతు ప్రకృతి వ్యవసాయంలో చేస్తున్న కృషి నేపథ్యంలో బ్రెజిల్ దేశం నుంచి వచ్చిన సభ్యుల బృందం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకునేందుకు రెండు రోజులు పర్యటించనున్నారు. బ్రెజిల్ బృందానికి ప్రకృతి వ్యవసాయంపై, జీవక ఎరువుల తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో నేలను సారవంతం చేసుకుని, అధిక దిగుబడులు సాధించేందుకు, ప్రకృతి వ్యవసాయం ద్వారా అనుసరించాల్సిన విధానాలను బ్రెజిల్ ప్రతినిధులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇప్పటికే 79 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులు ఆసక్తి చూపిస్తూ ముందుకు వెళుతున్నారని, మరో 77 గ్రామాలను గుర్తించడం జరిగిందన్నారు. ప్రతి గ్రామంలోనూ ప్రకృతి వ్యవసాయం అనే విధానం దిశగా, సేంద్రియ ఎరువులను తగ్గించి, జీవక ఎరువులను వినియోగించి, భవిష్యత్ తరాలకు, ఆరోగ్యవంతమైన ఆహారం, మంచి ప్రకృతిని అందించడమే, ప్రకృతి వ్యవసాయ లక్ష్యమని తెలిపారు. 1300 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని, ఇతర రాష్ట్రాలకు వెళ్లి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని రాజకుమారి తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై కళాత్మకంగా ఎన్నో ప్రయోగాలు చేసిన రైతు యెర్రు బాపయ్య మాట్లాడుతూ బ్రెజిల్ నుంచి వచ్చిన 25 మంది సభ్యులకు ప్రకృతి వ్యవసాయంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో బ్రెజిల్ ప్రతినిధులు తమ సమస్యలను క్షేత్రస్థాయిలో నివృత్తి చేసుకున్నారు.

## గుంటూరులో డ్రైన్లు, ర్యాంపులపై ఆక్రమణలు తొలగింపు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని హనుమయ్య విగ్రహం నుండి బృందావన్ గార్డెన్స్, లక్ష్మీపురం మదర్ థెరిస్సా విగ్రహం వరకు బుధవారం నుండి ఇరువైపులా డ్రైన్లపై ర్యాంప్ లు, ఆక్రమణలను తొలగించి, పూడికతీత పనులు చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులతో సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో వర్షం నీరు రోడ్ల మీద నుండి నేరుగా డ్రైన్ లోకే వెళ్లాలని, అందుకు తొలుత డ్రైన్లను ఓపెన్ చేసి, నూరు శాతం పూడిక తీయాలన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో డ్రైన్లు ఓవర్ ఫ్లో జరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగాలు సమన్వయంతో డ్రైన్ల శుభ్రం, ఆక్రమణల తొలగింపు చేపట్టాలని ఆదేశించారు. అలాగే జిన్నా టవర్ నుండి చేపట్టిన డ్రైన్లపై స్లాబ్లు, ఆక్రమణల తొలగింపు, పూడికతీత పనులను మరోవైపు కూడా వేగంగా చేస్తూ వై జంక్షన్ వరకు చేపట్టాలని డిసిపిని ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులు ఏఈల వారీగా బిల్లులను నిధి పోర్టల్ ల్లో అప్ లోడ్ చేయాలన్నారు. ప్రజారోగ్య అధికారులు డివిజన్ల వారీగా మైక్రో ప్యాకెట్స్ రీ ఫైనల్ చేయడం, వాటికి కేటాయించిన కార్మికులు, ఇళ్లు సంఖ్యలతో కూడిన వివరాలు అందించాలన్నారు. అలాగే డివిజన్లలో పారిశుధ్య పనులు మెరుగ్గా చేపట్టేందుకు అవసరమైన వాహనాలు, సామగ్రి కోసం రిపోర్ట్ ఇవ్వాలన్నారు. ప్రజారోగ్య విభాగంలో కార్మికులను సద్వినియోగం చేసుకోవాలని, కొన్ని డివిజన్లలో మస్టర్ అనంతరం విధుల్లో కార్మికులు ఉండడం లేదని, మధ్యాహ్నం పని చేయడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని, తమ క్షేత్ర స్థాయి పర్యటనలో గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఎస్ఎస్ లకు కేటాయించిన అదనపు ట్రాక్టర్లు, కార్మికులతో చెట్ల కొమ్మలు, భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ (ఇంచార్జి) సుందర్రామిరెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీ నారాయణ, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల నిరసనలు



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయి పై, అత్యంత దురుసుగా ప్రవర్తించిన న్యాయవాది రాకేష్ కిషోర్ ను సామాజికంగా వెలివేయాలని, భారత ప్రభుత్వం ద్వారా ఎటువంటి అవకాశాలు, సహాయం లభించకుండా చేయాలని బార్ అసోసియేషన్ న్యాయవాదులు తమ నిరసనను వ్యక్తం చేశారు.

సోమవారం సుప్రీంకోర్టులో చోటు చేసుకున్న అత్యంత దారుణమైన ఉదంతం, ప్రధాన న్యాయమూర్తి గవాయ్ పై, న్యాయవాది దురుసుగా బూటు విసిరేసె ప్రయత్నం,అత్యంత హేయమైన చర్య అని, తెనాలి బార్ అసోసియేషన్ నాయకులు మంగళవారం విధులు బహిష్కరించి, కోర్టు ప్రధాన ద్వారం వద్ద తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ తెనాలి శాఖా అధ్యక్షులు బేతాళ ప్రభాకర్ మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో, సోమవారం సుప్రీంకోర్టులో చోటుచేసుకున్న ఉదంతం అత్యంత హేయమైన చర్యని, న్యాయవాది రాకేష్ కిషోర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరో సీనియర్ న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ రాకేష్ కిషోర్ అనే న్యాయవాది అనుసరించిన విధానం అత్యంత హేయమైన విధానం అని, ఈ విషయంలో న్యాయవాది రాకేష్ కిషోర్ పట్ల బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తగు చర్యలు కఠినంగా తీసుకోవాలన్నారు. మానసికంగా, భౌతికంగా, అతనికి అన్ని విధాలుగా సహకారం లభించకుండా చూడాలన్నారు. ప్రభుత్వ పథకాలు ఏవి కూడా అమలు చేయరాదన్నారు. ప్రధాన న్యాయమూర్తిని అవమానించడం అంటే, రాజ్యాంగాన్ని అవమానించడమే అన్నారు. న్యాయవాది రాకేష్ కిషోర్ పై తీసుకునే చర్యలు వినూత్నంగా ఉండాలని, మరలా అటువంటి, దురుసు చర్యలకు, మరొకరు పాల్పడాలంటే భయపడేలా ఉండాలని అన్నారు. రాకేష్ కిషోర్ కు ఎటువంటి సహకారం కూడా అందకుండా చేయడమే సరైన శిక్షగా తెలిపారు. భారతదేశ న్యాయ చరిత్రకు సోమవారం చీకటి రోజు అని అన్నారు. ఈ కార్యక్రమంలొ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు అన్నం పిన్నారావు, కార్యదర్శి హరిదాసు గౌరీ శంకర్, సభ్యులు కొమ్ము అబ్రహం లింకన్, మద్ది మల్లికార్జునరావు, ఏ ఏ ఎఫ్ జిల్లా అధ్యక్షులు దాసరి శ్రీధర్, రవిరాజ్, వేములపల్లి శ్రీనివాస్, అబ్దుల్ ఆరిఫ్, కుటుంబరావు, ఈ ప్రకాష్, బెనహర్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై విస్తృత ప్రచారం



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్)**

బుధవారం జిల్లా వ్యాప్తంగా సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ పై ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించా రు. విద్యాశాఖ, రాష్ట్ర పన్నుల శాఖ, మున్సిపల్, రెవెన్యూ, పంచాయితీ శాఖల అధ్వర్యంలో గుంటూరు , మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోను, తెనాలి, పొన్నూరు మున్సిపాల్టీలతో పాటు అన్ని మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల, కళాశాల విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు.

విధ్యార్థులకు జీఎస్టీ 2.0 సంస్కరణలపై వ్యాసరచన, వకృత్వం, చిత్ర లేఖనం పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సహకంగా బహుమతులు, సర్టిఫికేట్లు ప్రదానం చేశారు. గుంటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధ్యార్థులు జీఎస్టీ 2.0 లో విద్య మరియు స్టేషనరీ వస్తువులపై తగ్గిన ధరలకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. గుంటూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విధ్యార్థులకు జీఎస్టీ 2.0 లో సవరించిన వస్తువుల పన్నుల శాతం, తగ్గిన ధరలపై సదస్సు ద్వారా అవగాహన కల్పించారు.

జీఎస్టీ 2.0 సంస్కరణలో విద్య మరియు స్టేషనరీ లకు సంబంధించి నోటు పుస్తకాలు, వ్యాయామ పుస్తకాలు, గ్రాఫ్ పుస్తకాలు, స్టేషనరీ వస్తువులు, ఎరేసర్లు, పెన్సిల్లు, క్రీయార్స్ లు మరియు షార్పనర్ లపై గతంలో ఉన్న 12 శాతం పన్నును పూర్తిగా తొలగించారు. జ్యామెంట్రీ బాక్స్ మరియు పాటశాల ట్రే లకు 12 శాతం ఉన్న పన్నును ఐదు శాతంకు తగ్గించారు. దీని వలన ప్రతి విద్యార్థికి విద్యా మరియు స్టేషనరి కొనుగోలు వలన సూమారు రూ. 960 వరకు పొదుపు అవుతుందని అధికారులు విధ్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

## కొత్త పింఛన్లలో రమణయ్యకు నమోదు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** పెదనందిపాడు మండలం కొప్పడు గ్రామానికి చెందిన కిలారి రమణయ్య, అతని భార్య ప్రమీలకు కొత్త పింఛన్లకు ప్రభుత్వం అవకాశం కల్పించిన వెంటనే నమోదు చేస్తామని డి. ఆర్. డి. ఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి. విజయలక్ష్మి, తెలిపారు. "మీరైనా పించను ఇప్పించండయ్యా..!" అను శీర్షికన ఒక దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన వార్తకు ఆమె వివరణ ఇస్తూ ఇ కెవైసి చేసుకోక పోవడంతో పింఛను రమణయ్యకు ఆగిందన్నారు. రమణయ్యకు సదరం ధృవీకరణ పత్రం ఉందని, ప్రమీల వృద్ధాప్య పింఛనుకు దరఖాస్తు చేసి ఉన్నారని తెలిపారు.

కిలారి రమణయ్య వికలాంగ పించనుకు, ప్రమీల వృద్ధాప్య పించనుకు అర్హులుగా ఉన్నారని, ప్రభుత్వం కొత్త పింఛన్ల నమోదుకు అవకాశం కల్పించిన వెంటనే ఇరువురికి పించను మంజూరుకు దరఖాస్తును ఆన్ లైన్ లో నమోదు చేయుటకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి చర్యలు చేపట్టారని వివరణ ఇచ్చారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68


# మానవతా విలువలు నేర్పిన వాల్మీకి : జిల్లా కలెక్టర్

○ **ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** రామాయణ" మహాకావ్యం ద్వారా మానవ సంబంధాలు, నైతిక విలువలు, కుటుంబ బాంధవ్యాలు, ఆదర్శ ప్రజాపాలన తదితర అంశాలను సమాజానికి అందించిన మహాకవి మహర్షి వాల్మీకి అని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జరిగిన మహర్షి వాల్మీకి జయంతి వేడుకలలో జిల్లా కలెక్టర ఏ తమీమ్ అన్సారియా, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి, వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘాల నాయకులతో కలిసి మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రామాయణ ఇతిహాసంలో మహర్షి వాల్మీకి తెలియజేసిన విలువలు, ప్రిన్సిపల్స్ ను వ్యక్తిగత జీవితంలోనూ, ప్రజా జీవితంలో ప్రతి ఒక్కరు అనుసరణీయమని అన్నారు. వీటిని దృఢమైన సంకల్పంతో ఆచారించటం ద్వారానే మహర్షి వాల్మీకికి నిజమైన నివాళి అని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర విజన్ 2047 లో భాగంగా రాష్ట్రాన్ని అభివృద్ధిలో దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలిపేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలుపరుస్తుందని వివరించారు. అభివృద్ధితోపాటు సామాజిక న్యాయం కోసం సంక్షేమ కార్యక్రమాలను వివిధ శాఖల ద్వారా, కార్పొరేషన్ల ద్వారా అమలు చేస్తుందని అన్నారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్ లోను అభివృద్ధితోపాటు సంక్షేమ కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి సక్రమంగా అమలు చేయాలని దిశా నిర్దేశం చేశారని చెప్పారు. సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రజలు అందించిన సూచనలను పరిగణలోకి తీసుకొని మరింత మెరుగ్గా అర్హత ఉన్న లబ్ధిదారులకు అమలు చేసేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ వై లక్ష్మీ శైలజ గౌడ్, గుంటూరు పార్లమెంట్ విశ్వబ్రాహ్మణ సాధికారిక కమిటీ అధ్యక్షులు జంపని నాగేశ్వరరావు, టిడిపి బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు వేములకొండ శ్రీనివాసులు, ఏ ఎన్ యు రిటైర్డ్ లైబ్రరీయన్ నాగమణి మాట్లాడుతూ మహర్షి వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కృషి ఉంటే మనుషులు ఋషులవుతారని దీనికి మహర్షి వాల్మీకి జీవితం గొప్ప ఉదాహరణ అన్నారు. ఒక మామూలు బోయ అకుంఠిత దీక్షతో మహర్షిగా మారి రామాయణ మహాకావ్యాన్ని రచించి భవిష్యత్తు తరాలకు ఆదర్శ జీవిత విధానం గురించి తెలియజేశారని అన్నారు. మహర్షి వాల్మీకి రచించిన మహాకావ్యం రామాయణంను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకొని మెరుగైన సమాజానికి సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి మయూరి, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ రాచకొండ నాగేశ్వరరావు, బిసి సంక్షేమ శాఖ అధికారులు ఉద్యోగులు, సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఎస్సీల కు అత్యున్నత స్థానాలను జీర్ణించుకోలేకే సిజెఐ గవాయ్ పై దాడి



○ సనాతన ధర్మంలో ఇలాంటి ఉన్మాదచర్యలకు స్థానం ఉండదు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకు అత్యున్నత స్థానాలను జీర్ణించుకోలేకే సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయిపై దాడికి ప్రయత్నం జరిగిందని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు అభిప్రాయపడ్డారు. అమరావతిలో సురేష్ బాబు అసోసియేషన్ పక్షాన విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పై రాకేష్ కిషోర్ అనే న్యాయవాది బూటుతో దాడికి యత్నించటం ఒక ఉన్మాద చర్యగా అభివర్ణించారు. ఈ దాడిని భారతన్యాయ వ్యవస్థ పై దాడిగా చూడాలన్నారు. ఎస్సీలు ఉన్నత స్థానాలలో ఉండడాన్ని ఓర్వలేక వివక్ష, ద్వేషపూరిత భావంతో రాకేష్ కిషోర్ దాడికి ప్రయత్నించాడన్నారు. రాకేష్ కిషోర్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై బూటుతో దాడి పాల్పడుతూ సనాత ధర్మాన్ని కాపాడుతున్నానంటూ వ్యాఖ్యలు చేయడం మత విద్వేషాలను రెచ్చకొట్టే ప్రయత్నంలో బాగమేనని అన్నారు. న్యాయమూర్తి పై బూటుతో దాడి చేయడాన్ని సనాతన ధర్మం సమర్ధిస్తుందా అని ప్రశ్నించారు. దేశ ప్రజల దృష్టిని ఆకర్షించడం,సనాతన ధర్మం కాపాడుతున్నానంటూ ప్రచారం చేసుకోవాలనే తప్పుడు ఆలోచనలతోనే సిజెఐ పై నిందితుడు దాడికి ప్రయత్నించాడన్నారు. సాటివారి పట్ల క్షమాగుణం, సహనం,ఓర్పు ఉండాలని సనాతన ధర్మం సూచిస్తుందన్నారు. సనాతన ధర్మంలో నైతిక విలువలను గౌరవిస్తూ దాడికి ప్రయత్నించిన రాకేష్ కిషోర్ ను క్షమించి విడిచి పెట్టాలని అదేశించి సిజెఐ గవాయ్ తన క్షమాగుణం,సహనం, హుందాతనాన్ని చూపించారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాకేష్ కిషోర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందేనని సురేష్ బాబు పేర్కొన్నారు.

## భద్రతా ప్రమాణాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ వకుల్ జిందాల్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం తుళ్లూరు మరియు నార్త్ సబ్ డివిజన్ల పోలీస్ అధికారులతో ఎస్పీ వకుల్ జిందాల్ అవగాహన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు.

తుళ్లూరు, నార్త్ డివిజన్ పరిధిలో వీవీఐపీ, వీఐపీ లు అధికంగా నివసించడంతో, ఆ ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టి, పర్యవేక్షణను మరింత పటిష్టం చేయాలని సూచించారు. గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని, పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచి, వారు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.

ప్రఖ్యాత విద్యాసంస్థలు ఈ రెండు సబ్ డివిజన్లలోనే ఎక్కువగా ఉండటంతో, విద్యార్థుల భద్రత కోసం పగలు, రాత్రి గస్తీని పటిష్టపరచాలని ఆయన సూచించారు. సచివాలయం, హైకోర్టు ప్రాంతాలకు వీవీఐపీ, జడ్జిలు రాకపోకల సమయంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు.

అలాగే అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సీసీటీవీ కెమెరాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని, డ్రోన్ బీట్‌లు నిర్వహిస్తూ ఓపెన్ డ్రింకింగ్ మరియు అసాంఘిక కార్యకలాపాలను నిరోధించాలన్నారు. ఈ సమావేశంలో తుళ్లూరు డీఎస్పీ మురళీ కృష్ణ, నార్త్ డీఎస్పీ మురళీ కృష్ణతో పాటు పలు పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులు ఏ పాపం చేసుకున్నారు ?



○ అందరికీ అన్నీ ఇస్తున్నారు... మా ప్రభుత్వ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యం ఆపాలి

○ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు చాంద్ బాష

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు చాంద్ బాష ఆవేదన వ్యక్తం చేశారు. మంగళగిరిలో ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు.

"కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అందరికీ అన్నీ ఇస్తున్నారు... "కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతులు, మహిళలు, విద్యార్థులు, పింఛనుదారులు అందరికీ ప్రయోజనాలు అందుతున్నాయి. కానీ ప్రభుత్వ ఉద్యోగుల గురించి మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. మేము కూడా ఈ రాష్ట్ర ప్రజల భాగమే. మా పట్ల ఇంత నిర్లక్ష్యం ఎందుకు?" అని ప్రశ్నించారు.

12వ వేతన సవరణ కమిటీని ఇంకా ఏర్పాటు చేయకపోవడం, గత పీఆర్సీ గడువు ముగిసి 26 నెలలు గడిచినా ఇన్‌టెరిమ్ రిలీఫ్ ప్రకటించకపోవడం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సీపీఎస్ వ్యవస్థపై ఇప్పటి వంకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం, పెండింగ్ బకాయిలు చెల్లించకపోవడం పట్ల కూడా విమర్శలు గుప్పించారు.

"ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ఇక నిర్లక్ష్యం చేయకండి. అక్టోబర్ 10న జరిగే రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో 28 శాతం ఐఆర్ ప్రకటించి ఉద్యోగుల మనోభావాలను గౌరవించాలని" ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని చాంద్ బాష కోరారు.

# మంత్రి సత్యకుమార్ సంచలనం... వైద్యారోగ్య శాఖలో విప్లవాత్మక పాలనా వికేంద్రీకరణ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** వైద్యారోగ్య శాఖలో ప్రస్తుతం సరికొత్త "పాలనా విప్లవం" కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్య శాఖలో పాలనా వ్యవహారాల వేగం, నైపుణ్యం, పారదర్శకతను పెంచే మహత్తర నిర్ణయం తీసుకోవడం ద్వారా మంత్రి సత్యకుమార్ యాదవ్ స్ఫూర్తిదాయక నాయకత్వాన్ని ప్రదర్శించారు. అధికార వికేంద్రీకరణలో చేసిన ఈ ప్రత్యేక నిర్ణయం రాష్ట్రంలోని వైద్య రంగానికి కొత్త శ్రేణి మార్పును తేవడంలో కీలకంగా మారింది. సత్వర నిర్ణయాలతో పాలనా వేగాన్ని(ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) పెంచాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తరచుగా చేస్తున్న సూచనలకనుగుణంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ నేతృత్వంలో చేపట్టిన అధికార వికేంద్రీకరణ ద్వారా, మంత్రిత్వ శాఖలో నిర్ణయాల వేగం, పారదర్శకత, మరియు సమర్థత సార్వత్రికంగా పెరుగుతున్నాయి.

వైద్యారోగ్య శాఖలో మంత్రిత్వ శాఖకు సంబంధించి మొత్తం 45 ప్రధాన అంశాల ప్రక్రియ ఉంటుంది. సాధారణంగా ప్రతి అంశం మంత్రి పరిశీలనకు వస్తుండటం వల్ల, ఫైళ్ళ సంఖ్య అధికంగా ఉండడం వల్ల నిర్ణయ ప్రక్రియలో జాప్యం ఏర్పడేది. పలు రొటీన్ ఫైళ్ళను కూడా మంత్రి పరిశీలించాల్సి రావడం, తుది నిర్ణయానికి రావడంలో ఆలస్యం చేయడమే కాకుండా, అధికారుల పని ఉత్సాహాన్ని కూడా ప్రభావితం చేసేది.

**విధాన పరంగా సంచలన నిర్ణయం...వికేంద్రీకరణ దిశగా కీలక దశలు:** జూన్ 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, వైద్యారోగ్య శాఖ మంత్రిగా సత్యకుమార్ యాదవ్ ఫైల్ ప్రాసెసింగ్ పద్ధతులు, సంబంధిత సమస్యలు పరిశీలించారు. ఇటీవల బాధ్యతల్ని చేపట్టిన సెక్రటరీ సౌరభ్ గౌర్‌తో కలిసి నిర్ణయాధికార వికేంద్రీకరణకు సంబంధించి అనేక సార్లు ఉన్నతాధికారులతో చర్చలు జరిపి, విస్తృత వికేంద్రీకరణకు ప్రతిపాదన రూపొందించాలని ఆదేశించారు. అధికారులతో చర్చించిన సౌరభ్ గౌర్ ఈ మేరకు ప్రతిపాదించిన విస్తృత అధికార వికేంద్రీకరణ ప్రణాళికను మంత్రి రూపొందించి ఆమోదించారు.

**సత్వర నిర్ణయాల కోసం కొత్త విధానం... 17 అంశాలు మాత్రమే మంత్రి పరిశీలనకు...:** మున్నెన్నడూ లేనివిధంగా మంత్రి సత్యకుమార్ ప్రవేశపెట్టిన పాలనా సంస్కరణ ప్రణాళిక ప్రకారం, మొత్తం 45 విస్తృత అంశాలకు సంబంధించి, మంత్రికి అత్యంత ప్రాధాన్యత కలిగిన 17 అంశాలు మాత్రమే పరిశీలనకు ఆమోదం, నిర్ణయం కోసం పంపబడతాయి, మిగతా 28 అంశాలు సెక్రటరీ, విభాగాధిపతులు మరియు మిడ్-లెవెల్ అధికారులు ద్వారా స్వతంత్రంగా నిర్ణయించబడతాయి.

విధానపరమైన విషయాలు, కేబినెట్ మరియు చట్టసభలకు సంబంధించిన అంశాలు, ముఖ్యమంత్రి సూచనలు, సిబ్బంది నియామకాలు, విజిలెన్స్ సంబంధిత వ్యవహారాలు, కొత్త కాలేజీల, ఆసుపత్రుల ఏర్పాటు, కేంద్ర ప్రభుత్వ సంప్రదింపులు, తాత్కాలిక సిబ్బంది రెగ్యులరైజేషన్, రాష్ట్ర విభజన చట్టానికి సంబంధించినవి మంత్రికి మాత్రమే పంపబడే అంశాల్లో ముఖ్యంగా ఉన్నాయి: .

**15 అంశాలపై నిర్ణయం సెక్రటరీదే ... సమర్థవంతమైన వ్యవహార నిర్వహణ :** వైద్యారోగ్య శాఖ సెక్రటరీ ఆధ్వర్యంలో 15 ముఖ్య అంశాలను సెక్రటరీ తుది నిర్ణయం తీసుకోగలుగుతారు. వీటిలో కోర్టుల ఆదేశాల అమలు, నియమాల మేరకు సిబ్బంది వైద్య ఖర్చుల చెల్లింపు, కాగ్ మరియు ఆడిట్ నివేదికలు, ఇంక్రిమెంట్లు మరియు ఇతర చెల్లింపులు, సెలవుల మంజూరు, విభాగాధిపతుల నిర్ణయంపై సమీక్ష, డిపిసి సిఫారసుల మేరకు పదోన్నతులు, విదేశీ పర్యటనలకు అనుమతులు, విచారణాధికారుల నియామకం, బడ్జెట్ ప్రధానమైన అంశాలు ఉన్నాయి.

**దిగువస్థాయి అధికారుల పరిధిలోకి సైతం 13 అంశాలు :** సెక్రటరీ కింద పనిచేసే అడిషనల్ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, డిప్యూటీ సెక్రటరీలతో పాటు మిడ్-లెవెల్ అధికారులకు 13 అంశాలపై నిర్ణయాధికారం కేటాయించబడింది. వీటిలో సెక్షన్ ఆఫీసర్ స్థాయి సిబ్బంది వరకు ఇంక్రిమెంట్లు మరియు ఇతర చెల్లింపులు, సిబ్బందికి అదనపు వైద్య ఖర్చుల మంజూరు, ఆర్టీఐ విషయాలు, వివిధ విభాగాల మధ్య సమన్వయం మరియు సమాచార సేకరణ, సమీక్షా సమావేశాల నిర్వహణ మరియు తదితర చర్యలు, పెండింగ్ విషయాల పర్యవేక్షణ మరియు పరిష్కారం, శాఖా పరంగా సిబ్బందికి తగు సమాచారం మరియు ఆదేశాల జారీ, ఇతర సాధారణ అంశాలు ఉన్నాయి.

**బాధ్యత, భాగస్వామ్యం, ఉత్పాదకతే ప్రధాన లక్ష్యం :** ఈ విస్తృత అధికార వికేంద్రీకరణ ద్వారా అధికారుల బాధ్యత, పాలనలో భాగస్వామ్యం, మరియు నిర్ణయాల్లో వేగం పెరుగుతుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. "వివిధ స్థాయిల్లో అధికారాన్ని కేటాయించడం ద్వారా సిబ్బంది స్వీయ బాధ్యతతో, నిబద్ధతతో, ఉత్సాహంతో పనిచేస్తారు. మంత్రి చూసుకుంటారులే...మనమెందుకు శ్రమించాలనే భావన తొలగిపోతుందని మంత్రి అన్నారు.

**నిరంతర సమీక్ష, ఫలితాల మానిటరింగ్ :** వైద్యారోగ్య మంత్రిత్వ శాఖలో ఈ కొత్త విధానం ఫలితాలను నిరంతరం సమీక్షిస్తూ, నివేదికలు అందించాలని సెక్రటరీ సౌరభ్ గౌర్ ను మంత్రి ఆదేశించారు. ఈ విధానం వల్ల నిర్ణయాల వేగం పెరుగుతుంది, సిబ్బంది ఉత్పాదకత మరియు పాలనా నైపుణ్యం మెరుగుపడుతుంది.

**వైద్యారోగ్య రంగంలో స్ఫూర్తిదాయక నాయకత్వం :** మంత్రి సత్యకుమార్ యాదవ్ తీసుకున్న ఈ నిర్ణయం వైద్య రంగంలో పరిపాలనా సంస్కరణలో విప్లావాత్మకమైన మార్పును సూచిస్తుంది. ప్రభుత్వ నిర్ణయాలు త్వరగా అమలులోకి రానున్నాయి, సిబ్బంది బాధ్యతను చక్కగా నిర్వర్తించగలిగేలా మార్పులు చోటు చేసుకున్నాయి. అధికారులకి స్వతంత్ర నిర్ణయాధికారం కల్పించడం ద్వారా సిబ్బంది ఉత్పాదకత, పాలనలో భాగస్వామ్యం, మరియు నిర్ణయ వేగంను పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఈ వికేంద్రీకరణ ద్వారా, వైద్యారోగ్య శాఖలో పారదర్శకత, సమర్థవంతమైన పాలన, మరియు సిబ్బందిలో నిబద్ధత పెరుగుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. మంత్రి సత్యకుమార్ నిరంతర సమీక్షలు, నివేదికలు అందించమని సెక్రటరీకి ఆదేశిస్తూ, పాలనా సంస్కృతిని మరింత మెరుగుపరుస్తున్నారు.

ఈ విధంగా, మంత్రి సత్యకుమార్ యాదవ్ నాయకత్వంలో వైద్యారోగ్య శాఖలో అధికారం వికేంద్రీకరణ ఒక స్ఫూర్తిదాయక ఉదాహరణగా నిలిచింది. ప్రజలకు నేరుగా ఉపయోగపడే పాలనా ఫలితాలను సాధించే దిశలో ఈ విప్లవాత్మక ప్రయత్నం విశిష్ట గుర్తింపు పొందింది.

# రాష్ట్రంలో ప్రజారంజక పాలన

○ అన్ని వర్గాల ప్రజలకూ న్యాయం

○ అడగకుండానే వరాలిస్తోన్న కూటమి ప్రభుత్వం

○ గత ప్రభుత్వంలో రోడ్లన్నీ అధ్వానం

○ సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతోందని, సంక్షేమం, అభివృద్ధి జోడు గుర్రాల్లా పరుగులు తీస్తున్నాయని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గుంటూరు నగరంలోని తొమ్మిదో డివిజన్ సుద్దపల్లి డొంక యాదవ బజారు 2/7, గణేశ్ నగర్ 2వ లైనులో రూ. 84 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నగరాన్ని నరకంగా మార్చారని మండిపడ్డారు. యూజీడీ పనులు ఎక్కడకక్కడ వదిలేయడంతో పాదచారులు సైతం బయటికి రావాలంటే ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. వైసీపీ హయాంలో ఏ వీధికెళ్లినా గుంతలమయమేనని విమర్శించారు. అలాంటి పరిస్థితి నుంచి గుంటూరు నగరాన్ని అద్దంలా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరద నీరు బయటికి పోయేందుకు సమగ్ర ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టామని తెలిపారు. సుమారు 40 ఏళ్లనుంచి అపరిష్కృతంగా ఉన్న మొండి గేటు వద్ద సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. వెంట్ వే నిర్మాణ పనులు వేసవిలో ప్రారంభిస్తామని, తద్వారా మురుగు సమస్య శాశ్వత పరిష్కారమవుతుందని వెల్లడించారు. అంతర్గతంగా ప్రతి ప్రాంతంలో మురుగు కాలువలు నిర్మిస్తున్నామని, రోడ్లు వేయిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశామని వెల్లడించారు. దీంతోపాటు ఎన్నికల్లో హామీ ఇవ్వకుండానే ఆటోడ్రైవర్లకు వరాలిచ్చిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ యాల్లావుల అశోక్, జాగర్లమూడి శ్రీనివాసరావు, ఐలా శ్రీనివాసరావు, అల్లం బాజీ, డివిజన్ అధ్యక్షులు బట్ట రాజా, రియాజ్, జాడ సురేష్ గట్టు శ్రీకాంత్, కందుకూరి వెంకట్, కూరాకుల ప్రభాకర్, ప్రసాద్, ఆరిఫ్, నరసింహ, కొలగాని కృష్ణ, రియాసత్ తదితరులు పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యం నాయుడు కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి లోకేష్



**చంద్రగిరి(జర్నలిస్ట్ ఫైల్) :** తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం గడ్డంవారిపల్లిలో ఇటీవల పరమపదించిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ ఛైర్మన్ పల్లినేని సుబ్రహ్మణ్యం నాయుడు కుటుంబాన్ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. తెలుగుదేశం పార్టీ చంద్రగిరి మండలం టీడీపీ అధ్యక్షుడిగా, ఉమ్మడి చిత్తూరు జిల్లా డీసీఎంఎస్ ఛైర్మన్ గా ఆయన విశేష సేవలందించారు. సుబ్రహ్మణ్యం నాయుడు నివాసానికి వెళ్లిన మంత్రి లోకేష్.. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సుబ్రహ్మణ్యం నాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి అన్నివిధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# అక్టోబరు 10 నుంచి రచ్చబండ కార్యక్రమం : జగన్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** అక్టోబరు 9న నర్సీపట్నం మెడికల్ కాలేజీని వైసిపి అధినేత జగన్ సందర్శించనున్నారు. అక్టోబరు 10 నుంచి నవంబర్ 22వరకూ రచ్చబండ కార్యక్రమం చేపట్టనున్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై కరపత్రాలు పంపిణీ చేయనున్నట్లు జగన్ చెప్పారు. కోటి సంతకాలను రచ్చబండ కార్యక్రమాల ద్వారా సేకరిస్తామని ఆయన వెల్లడించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కనీసం ప్రతి పంచాయతీ నుంచి 500 మందితో సంతకాలు సేకరిస్తామన్నారు. మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నేతలతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన పలు కీలక విషయాలను వెల్లడించారు.

కాగా, ఈ సమావేశంలో జగన్ మాట్లాడుతూ.. 'అక్టోబరు 28న నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు ఉంటాయి. నియోజకవర్గ స్థాయిలో ఉన్న అధికారికి డిమాండ్ పత్రాలను సమర్పించాలి. జిల్లా కేంద్రాల్లో నవంబర్ 12న ర్యాలీలు జరుగుతాయి. ఒక జిల్లాలో నేను కూడా పాల్గొంటాను. నవంబర్ 23న నియోజకవర్గ కేంద్రాల నుంచి సేకరించిన సంతకాలు జిల్లా కేంద్రానికి చేరుకుంటాయి. నవంబర్ 24న సేకరించిన సంతకాలతో కూడిన వాహనాలను జిల్లా కేంద్రంలో జెండా ఊపి విజయవాడకు తరలిస్తారు. సేకరించిన ఈ సంతకాలు గవర్నర్ గారికి అప్పగించే కార్యక్రమం తదుపరి జరుగుతుంది' అని వైఎస్ జగన్ తెలిపారు. వైసిపి హయాంలో విద్యార్థుల డ్రాపౌట్లు లేవు. కూటమి పాలనలో ప్రభుత్వ స్కూళ్లలో ఐదు లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారు. రైతులు ఎరువుల కోసం రోడ్డెక్కుతున్నారు. ఎరువుల పంపిణీలో కూడా స్కాంలు జరుగుతున్నాయి. దళారీలతో చేతులు కలిపారు. ప్రజారోగ్య వ్యవస్థను పూర్తిగా దెబ్బతీశారు. పేదలను ఇంకా అన్యాయం చేస్తున్నారు. వారిని మరింత పేదరికంలోని నెడుతున్నారు అని జగన్ మండిపడ్డారు.

భవిష్యత్తులో కూడా ఉచితంగా నాణ్యమైన వైద్యం అందనీయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్నదని విమర్శించారు.

# ఫ్యాప్టో 'పోరుబాట' ఘనవిజయం... మహాధర్నాలో ఉపాధ్యాయుల ఆగ్రహ గర్జన

○ వేలాదిమంది ఉపాధ్యాయుల మధ్య కదనోత్సాహరంగంగా ఫ్యాప్టో మహాధర్నా

○ బోధనేతర కార్యక్రమాలు బహిష్కరణ కు పిలుపు

○ పెండింగ్ బకాయిలు, 12వ పిఆర్సి ప్రకటించాలంటూ డిమాండ్



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది ఉపాధ్యాయుల సమక్షంలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిర్వహించిన "పోరుబాట" మహాధర్నా ఘనవిజయవంతంగా ముగిసింది. ఈ ధర్నా శిబిరం నుంచే బోధనేతర కార్యక్రమాలు, విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్కరించనున్నట్లు ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ ప్రకటించింది. ఈ కార్యక్రమానికి ఫ్యాప్టో చైర్మన్ ఎల్. సాయి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. విద్యారంగంలో బోధనేతర కార్యక్రమాలు విపరీతంగా పెరిగిపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బకాయిలు విడుదల చేయడంతోపాటు 12వ పిఆర్సి, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను వెంటనే అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సరెండర్ లీవులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మేము 57 సూత్రాన్ని అమలు చేసి, 2003 డిఎస్సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఫ్యాప్టో రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఎస్. చిరంజీవి మాట్లాడుతూ ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ తరపున బోధనేతర కార్యక్రమాలు, విద్యాశక్తి బహిష్కరణకు పిలుపునిచ్చారు. మండల పరిషత్, జిల్లా పరిషత్‌లలో పనిచేస్తూ మరణించిన ఉపాధ్యాయుల వారసులకు కారుణ్య నియామకాలు వెంటనే ఇవ్వాలని, 1998 డిఎస్సీ మిగిలిన వారికి పోస్టింగులు కల్పించాలని, 1998, 2008 డిఎస్సీ వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. అలాగే ఫ్యాప్టో నోటీసులో ఉన్న 20 డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఎలను ప్రకటించాలని, దొడ్డి దారి బదిలీలు చేయడం అసమంజసం అని, న్యాయబద్ధమైన కౌన్సిలింగ్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. హైస్కూల్ ప్లస్‌లలో ఉపాధ్యాయ నియామకాలు చేపట్టి ఆ సంస్థలను బలోపేతం చేయాలని ఆయన సూచించారు. గురుకులాలు, రెసిడెన్షియల్ స్కూల్స్, సొసైటీలలో సేవా విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని కూడా డిమాండ్ చేశారు. ఈ "పోరుబాట" కార్యక్రమంలో చైర్మన్ ఎల్. సాయి శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ ఎస్. చిరంజీవి తోపాటు కో-చైర్మన్‌లు కె. నరహరి, బి. మనోజ్ కుమార్, సిహెచ్. వెంకటేశ్వర్లు, కె. ప్రకాశ్‌రావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌లు ఎన్. వెంకటేశ్వర్లు, కె. భానుమూర్తి, జి. శ్రీనివాసరావు, కోశాధికారి చింతల సుబ్బారావు, కార్యదర్శి ఎం. ప్రవీణ్ కిరణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం. రఘునాథరెడ్డి, సిహెచ్. మంజుల, జి. హృదయరాజు, సిహెచ్. రమేష్, ఎం. బాబు రాజేంద్రప్రసాద్, సిహెచ్. రవి, పి. నరోత్తం రెడ్డి, బి. కరిమల్లారావు చౌదరి తదితరులు పాల్గొన్నారు.



ఈ మహాధర్నాకు ఉభయ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ బి. గోపి మూర్తి, మాజీ ఎమ్మెల్సీలు కేఎస్. లక్ష్మణరావు, కత్తి నరసింహారెడ్డి, ఏపీ జేఏసీ చైర్మన్ ఎ. విద్యాసాగర్, ఏపీ ఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ, ఏపీసీపీఎస్ఈఏ బాధ్యులు సి.ఎం. దాస్, సతీష్, బాజీ పఠాన్ తదితరులు హాజరయ్యారు.



Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467